# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 1-8-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 311 | పేజీలు: 4 | వెల: రూ.1/-







# కరోనా బారిన పడ్డ వారందరికి వైద్యం చేయిస్తున్నాం

## ఎక్కడా చికిత్సలకు వెనకాడడం లేదు

## ఆక్సిజన్ కొరత, పీపీఈ కిట్లు, మాస్కులు వేటికీ కొరత లేదు

## ఖమ్మంలో కరోనాపై సమీక్షించిన మంత్రి ఈటెల




ఖమ్మం,జూలై31(ఆర్ఎన్ఎ): కరోనా బారిన పడి ఎన్ని కేసులు వచ్చినా తట్టుకోగల శక్తి, సత్తా తెలంగాణకు ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. పేదవాళ్లు భయంతో వణికిపోయి ప్రైవేటు హాస్పిటల్‌కు పోయి లక్షల రూపాయలు పోగొట్టుకున్నారు. మనిషిని బతికించడానికి ఏ మందు అవసరం ఉన్న వాడండి అని డాక్టర్స్‌ను విజ్ఞప్తి చేస్తున్నాం. ఎక్కడా మందులకు కొరత లేదు. ఆక్సిజన్ కొరత, పీపీఈ కిట్లు, మాస్కులు వేటికీ కొరత లేదు. మీకు ఏది అవసరం ఉన్నా దాన్ని వాడండి. ఎక్కడా రాజీ పడం అని మంత్రి చెప్పారు. వైద్యరంగంలో కేరళ, తమిళనాడు తర్వాతి స్థానంలో తెలంగాణ రాష్ట్రం ముందున్నదని ఈటెల రాజేందర్ అన్నారు. ఖమ్మంలో శుక్రవారం కరోనాపై మంత్రి సమీక్షించారు. కరోనా కష్టకాలంలో సేవ చేస్తున్న వైద్యులకు మంత్రి అభినందనలు చెప్పారు. శానిటేషన్ వర్కర్ల పని అభినందనీయం అని అన్నారు. ఖమ్మంలో ప్రభుత్వ డాక్టర్లు గొప్పగా పనిచేస్తున్నారని ఆయన పొగిడారు. కరోనా అందర్నీ పట్టిపీడిస్తుందని, గతంలో కూడా ఇలాంటి వైరస్‌లు అనేకం వచ్చాయని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ మీడియా ఉన్నందున ప్రపంచంలోని ఏ మూల ఏం జరుగుతుందో అందరికీ తెలుస్తోందని, వూహాన్ నగరంలో చేసిన ఏర్పాట్లను చూసి ప్రజలంతా ఇది భయంకరమైన వైరస్ అని వణికిపోయారని మంత్రి చెప్పారు. అమెరికానే విలవిలాడిపోయిందని, మన దేశంలో వస్తే ప్రమాదకరమని అందరకూ భయపడ్డారని, కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి లేదని మంత్రి అభిప్రాయపడ్డారు. మనకు ఉన్న ఇమ్యూనిటీ పవర్ వల్ల మనం దీన్ని తట్టుకోగలి గామని చెప్పారు. టీబీ, మలేరియాను కూడా ఎదుర్కున్నామని దీన్ని కూడా ఎదుర్కోగలమని ధైర్యం చెప్పారు. మొదట్లో దీన్ని ఇంపోర్ట్ వైరస్ అనుకున్నామని, కానీ ఇప్పుడు ఇక్కడే వ్యాపిస్తోంది. ప్రజల్లో ధైర్యం నింపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని, దాని కోసం కృషి చేస్తున్నామని ఈటెల అన్నారు. ప్రతి ఒక్కరికి మంచి వైద్యం అందిస్తామని, ఎన్ని కోట్లు ఖర్చైనా ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రీట్‌మెంట్ అందించాలని కేసీఆర్ చెప్పారని అన్నారు. ప్రతి 50 ఏండ్లకు , 100 ఏండ్లకు ఏదో ఒక భయంకరమైన వైరస్ మనిషిని భయపెట్టిస్తుందని చరిత్ర చెప్తోందని, గతంలో వచ్చిన వైరస్‌ల వల్ల అనేక మంది చనిపోయారని గుర్తు చేశారు సార్స్, ఎబోలా లాంటి వైరస్‌లను ఎదుర్కున్నాం. దీనిపై రిసెర్చ్ జరుగుతోంది. ఈ వైరస్‌కు మనిషిని చంపగలిగే శక్తి లేదు. నిర్లక్ష్యంగా ఉంటే కచ్చితంగా చనిపోతాం. నూటికి 80 శాతం మందికి వైరస్ తెలియకుండనే క్యూర్ అయిపోతుంది. సీఎం తెచ్చిన కాన్సెప్ట్ వల్ల ఇన్‌స్టిట్యూషన్ డెలివరీలు పెరిగాయని మంత్రి అన్నారు. వాటిలో దాదాపు 50 శాతం పైన డెలివరీలు గవర్నమెంట్ హాస్పిటల్స్‌లో జరుగుతున్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలోనే డెలివరీస్ నిర్వహించిన హాస్పిటల్‌లో ఎమ్‌సీహెచ్ నంబర్ 1 అని, అవార్డులు కూడా వచ్చాయని అన్నారు. కమిట్‌మెంట్ ఉంటేనే అలాంటివి సాధ్యం అవుతాయని కొనియా డారు. కొంత మందికి హోం ఐసోలేషన్‌లో క్యూర్ అవుతోంది. 14 శాతం మందికి డాక్టర్ల ట్రీట్‌మెంట్‌తో నయం అయ్యే అవకాశం కనిపిస్తోంది. జ్వరం వచ్చినా ఏమైతదిలే అని నిర్లక్ష్యంగా ఉన్నవారు ఇబ్బందికి గురయ్యారు. కేవలం 5శాతం మందికి మాత్రమే సీరియస్‌గా ఉందని మంత్రి అన్నారు. ఈ వైరస్ వస్తది అంట పోతది అంట అనే భావన ప్రజల్లోకి వచ్చిందని, కానీ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఇల్లు హోమియోపతి దవఖాన అయిందని, ప్రజలంతా ఎక్కడికి అక్కడ వైరస్‌ను నివారించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. హోం ఐసోలేషన్ సదుపాయాలు లేని వారికి ప్రభుత్వం తరఫున ఐసోలేషన్ ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. డాక్టర్లు పేషంట్లను ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని అన్నారు. సమీక్షలో మంత్రి పువ్వాడ అజయ్‌తో పాటు జిల్లా వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తైపీ మాజీ అధ్యక్షుడు లీ టెంగ్ హుయి మృతి

తైపే,జూలై31(ఆర్ఎన్ఎ): తైవాన్‌లో ప్రత్యక్ష ఎన్నికలతోపాటు ఇతర ప్రజాతంత్ర మార్పులు తీసుకువచ్చిన ఆ దేశ మాజీ అధ్యక్షుడు లీ టెంగ్ హుయి (97) గురువారం మరణించారు. హృద్రోగ సంబంధ సమస్యలు, అవయవాలు పని చేయకపోవడంతో గత ఫిబ్రవరి నుంచి తైపే వెటరన్స్ జనరల్ హాస్పిటల్‌లోనే ఉన్నారు. తైవాన్‌కు చైనాయేతర గుర్తింపు తేవడంతోపాటు తమ దేశానికి స్వాతంత్యం÷-ర కావాలని ఆయన ఆకాంక్షించారు. తైవాన్ తమలో అంతర్భాగం అని భావిస్తున్న చైనాకు లీ టెంగ్ కోరిక ఆగ్రహాన్ని తెప్పించింది. ఆయన తైవాన్‌కు స్వాతంత్యం÷-ర కావాలని అడిగినా తర్వాత అనారోగ్య కారణాలతో ప్రజా జీవితం నుంచి వైదొలిగారు.

# సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు పదివేల జరిమానా

లక్నో, జూలై 31(ఆర్ఎన్ఎ): సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తే ఇకపై రూ.10,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ మేరకు కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చెల్లించాల్సిన జరిమానాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భారీగా పెంచింది. దీనికి సంబంధించిన బిల్లుకు జూన్‌లో ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కొత్త ట్రాఫిక్ జరిమానాలు ఆగస్టు 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

# వందేభారత్‌కూ తప్పని బంగారం స్మగ్లింగ్

హైదరాబాద్,జూలై31(ఆర్ఎన్ఎ): అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతరాత్రి వందే భారత్ మిషన్ ప్రత్యేక విమానంలో దామన్ నుంచి హైదరాబాద్‌కు 11 మంది ప్రయాణికులు వచ్చారు. వారి నుంచి 3.11 కిలోల బంగారాన్ని అధికారులు వందే భారత్ మిషన్ ప్రత్యేక విమానంలో చేసుకున్నారు. దీని విలువ రూ.1.66 కోట్లు ఉంటుందని తెలిపారు. ప్యాంట్ల లోపలివైపు ప్రత్యేకంగా జేబులు ఏర్పాటు చేసుకున్నారని, వాటిలో బంగారం దాచుకుని అక్రమంగా తరలిస్తున్నారని వెల్లడించారు. ఆ 11 మందిని అరెస్టు చేశామని, వారిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# కోల్‌కతాకు వచ్చే విమానాలపై ఆంక్షలు

కోల్‌కతా,జూలై31(ఆర్ఎన్ఎ): కోల్‌కతాకు ఆరు నగరాల నుంచి వచ్చే ప్రయాణికుల విమానాలపై ఆంక్షలను పొడిగించారు. కోవిడ్19 హాట్‌స్పాట్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, పుణె, చెన్నై, నాగపూర్, అహ్మదాబాద్ నగరాల నుంచి కోల్‌కతా వచ్చే విమానాలపై ఆగస్టు 15వ తేదీ వరకు బ్యాన్ విధించారు. కోల్‌కతాలోని నేతాజీ సుభాశ్ చంద్ర బోస్ అంతర్జాతీయ విమానాశ్రయ ఈ విషయాన్ని వెల్లడించింది. బెంగాల్‌లో కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు వారానికి రెండు రోజులు సంపూర్ణ లాక్‌డౌన్ పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# నూతన సచివాలయం నమూనాపై సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, జూలై31: నూతన సచివాలయం నమూనాపై ముఖ్యమంత్రి కేసీఆర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రగతి భవన్‌లో జరుగుతున్న ఈ సమావేశానికి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఇంజినీర్లు, ఆర్కిటెక్చర్లు హాజరయ్యారు.

అర్కిటెక్ట్ నిపుణులు ఆస్కార్-పొన్ని ఇచ్చిన నమూనాకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన కేసీఆర్.. కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని బుధవారం జరిగిన సమావేశంలో ఇంజినీర్లకు, అధికారులకు సూచించారు. అధికారులు, ఇంజినీర్లు కలిసి మార్పులు, చేర్పులు చేశారు. ఈ అంశంపైనే అధికారులతో సీఎం చర్చిస్తున్నారు.

కొత్త సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు, సలహాదారుల చాంబర్లలో కూడా అన్ని సౌకర్యాలు ఉండాలని గతంలో సీఎం కేసీఆర్ చెప్పిన విషయం విదితమే. ప్రతి అంతస్తులో భోజనం చేసేందుకు డైనింగ్ హాలు, మీటింగ్ హాలు, సందర్శకుల కోసం వెయిటింగ్ హాలు ఉండాలని, పార్కింగ్ ప్రదేశంలో అన్ని రకాల వాహనాలను నిలిపే సౌకర్యం ఉండాలని స్పష్టంచేశారు.

# సారే పట్టి కుండ తయారు చేసిన మంత్రి



సిద్దిపేట, జులై 31 : జిల్లా పర్యటనలో ఆర్థిక శాఖ మంత్రి బిజీబిజీ గడిపారు. గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సిద్దిపేట అర్బన్ మండలం నాంచారుపల్లి, బక్రిచెప్యాల, ఏలుపల్లి గ్రామాలలో మంత్రి హరీశ్ పర్యటించారు. నాంచారుపల్లి, బక్రిచెప్యాలలో సెగ్రీ గేషన్ షెడ్డు- వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలు, 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మిషన్ భగీరథ వాటర్ ట్యానీకు, బక్రిచెప్యాలలో శాలి వాహన కుమ్మరి సంఘ భవనం, రెడ్డి కమ్యూనిటీ హాల్ భవనాలను ప్రారంభించారు.

అదే విధంగా ఏలుపల్లి గ్రామంలో గ్రామ ఫంక్షన్ హాల్, యూత్ భవన నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు, వైకుంఠ ధామం, సెగ్రీ గేషన్ షెడ్డు- వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. నాంచారుపల్లి షెడ్డులో మరో రెండు నాడెం కంపోస్టు పిట్స్ నిర్మించాలని ఏపీవో నర్సింగరావుకు మంత్రి సూచించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేసి ఇచ్చేలా గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. చైతన్యపర్చాలని సర్పంచ్ కల్పనకు మంత్రి సూచించారు.

ఈ మేరకు సెగ్రీ గేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువుకు సిద్ధం చేసిన చెత్తను నాడెం కంపోస్టు పిట్ లో వేశారు. అదే విధంగా రాఖీ పండుగను పురస్కరించుకుని బక్రి చెప్యాల గ్రామ మహిళా సంఘం ప్రతినిధి మంత్రికి రాఖీ కట్టారు. బక్రిచెప్యాల గ్రామంలో శాలి వాహన కుమ్మరి సంఘ భవనం ప్రారంభించారు.

పక్కనే సారే పట్టి కుండలు తయారు చేస్తున్న విధానాన్ని మంత్రి పరిశీలించి, తానూ ఒక్క కుండ తయారు చేస్తానని మంత్రి కాసేపు కుమ్మరి సారే పట్టి కుండ తయారు చేశారు. మంత్రి వెంట సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, సర్పంచ్ కల్పన, బక్రిచెప్యాల సర్పంచ్, పీఆర్ డీఈ వేణు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు



మహబూబ్ నగర్, జులై 31 : టీఆర్ఎస్ ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ బంగారు తెలంగాణ రాష్ట్రం కావాలని ఆకాంక్షించారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అన్ని విధాలుగా దోపిడీకి గురైందని భావించి ప్రజలు ఉద్యమించాలని జై శంకర్ సార్ పిలుపునిచ్చారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ ఇంచార్జ్ ఆర్ జేసీ కృష్ణ, పలువురు టీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ జూతికి - పండిట్ జవహారు
నేతకు - సేవల నానచ్చి - నిశ్చల మతియై
నీతికి - నిలబడి వనితల
ఖ్యాతికి - రూపము గ నిలచె కమలా నెహ్రూ !!

(ఆగష్టు 1 కమలా నెహ్రూ జయంతి..)



-రాధశ్రీ

సెల్: 9494481210

# నేడు విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగం

న్యూఢిల్లీ, జులై 31:: ప్రధాని నరేంద్రమోదీ రేపు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. శనివారం సాయంత్రం 4:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2020' గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో పాల్గొననున్న ప్రధాని.. ఆ సందర్భంగా ఆన్‌లైన్‌లో విద్యార్థులతో ముచ్చటించనున్నారు. నూతన విద్యా విధానంపై విద్యార్థులతో అభిప్రాయాలను పంచుకోవడంతోపాటు పలు అంశాలపై ఆయన చర్చించనున్నారు.

విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడంలో భాగంగా 2017 నుంచి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నారు. నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రారంభమైన తొలి ఏడాదే 42 వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2019కి ఆ సంఖ్య రెండు లక్షలకు

# నకిలీ మద్యం విషాదంపై న్యాయ విచారణకు సీఎం ఆదేశం

చండీగఢ్, జులై 31: పంజాబ్‌లోని అమృత్‌సర్, బటాలా, టార్న్ తరన్ జిల్లాల్లో కల్తీ మద్యం సేవించి 21 మంది మృతిచెందిన ఘటనపై ఆ రాష్ట్ర సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ న్యాయ విచారణకు ఆదేశించారు.

ఈ విషయంపై జలంధర్ డివిజనల్ కమిషనర్ నేతృత్వంలోని మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశించారు. బటాలాలో నేడు మరో ఐదు మరణాలు సంభవించాయి. ఆస్పత్రిలో చేరిన మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది.

టార్న్ తరన్ జిల్లాలో మరో నాలుగు మరణాలు సంభవించాయి.

ఈ విషాదానికి దారితీసిన పరిస్థితులను, వాస్తవాలను విచారణ ప్యానెల్ పరిశీలిస్తుందని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ కేసులో దోషులుగా తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పనిచేస్తున్న నకిలీ మద్యం తయారీ యూనిట్లను అరికట్టడానికి సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాల్సిందిగా పోలీసులను ఆదేశించారు.

# పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు



మహబూబ్ నగర్,జులై 31: నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు దగ్గర పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ ఫేస్-1,2,3 పనులను మంత్రులు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సాగునీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్ పరిశీలించారు. ప్రాజెక్ట్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పనుల ప్రగతి నమూనాలను ఫొటో గ్యాలరీ ద్వారా పరిశీలించారు.

కార్యక్రమంలో ఎంపీలు మన్నె శ్రీనివాస్ రెడ్డి, రాములు, విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అబ్రహం, ఎమ్మెల్సీలు దామోదర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# నూతన విద్యావిధానంపై సమగ్రంగా చర్చించాలి !

నేటి నిజం

శనివారం 1-8-2020

నూతన విద్యావిధానం-2020 ద్వారా విద్యా వ్యవస్థలో చాన్నాళ్లుగా అవసరమైన సంస్కరణలను చేపట్టేం దుకు అవకాశం ఏర్పడిందని, ఇది మున్ముందు లక్షలమంది జీవితాలను అద్భుతంగా ప్రభావితం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. నూతన విద్యావిధానానికి కేబినేట్ ఇటీవలే ఆమోదం తెలిపింది. అయితే ఇలాంటి ఓ బృహత్తర కార్యక్రమం చేపట్టే ముందు విస్తృతస్థాయిలో చర్చ సాగాలి. సెమినార్లు నిర్వహించాలి. అధ్యాప కులు, విద్యార్థులు, విద్యారంగ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించాలి. పార్లమెంట్ ఉభయసభల్లో చర్చించా లి. అప్పుడే అనుమానాలు నివృత్తి అవుతాయి. అలాగే వివిధ దేశాల్లో అమలవుతున్న విద్యావిధానంతో సమీక్షించాలి. నిజానికి విద్యావిధానంలో అభ్యసనం, పరిశోధన, ఆవిష్కరణలు ఎంతో ముఖ్యం. నూతన విద్యావిధానం ఉత్తేజపూరిత జ్ఞాన సముపార్జనలోకి దేశాన్ని తీసుకెళుతుందని మోదీ విశ్లేషించారు. సరళత, సమానత్వం, నాణ్యత, జవాబుదారీతనం, అందరికీ అందుబాటులో అనే పునాదులపై నూతన విద్యావిధానం ఉంటుందన్నారు. కొత్త విధానం ద్వారా మన దేశం మరింత మహోజ్వలం అవుతుందన్న, సమృద్ధిని సాధిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అయితే ఇది ఎంతమేరకు సత్ఫలితాలు ఇస్తుందన్న దానిపై చర్చించాలి. మన దేశ అవసరాలతో పాటు, ప్రపంచ దేశాల్లో పోటీకి నిలబడగలమా అన్నది కూడా ఆలోచన చేయాలి. ప్రపంచ విద్యారంగాన్ని తట్టుకుని మన విద్యార్థి నిలబడినప్పుడే అంతర్జాతీయంగా మన విద్యకు ప్రాధాన్యం లేదా డిమాండ్ ఉంటుంది. ఇక్కడ ఏదో చదివి ఇతర దేశాలకు వెళ్లగానే అంతా కొత్తగా అనిపించేలా ఉంటే విద్ఆయర్థి ఒత్తడికి గురి కాగలడు. అందువల్ల కేబినేట్ ఆమోదించిన విద్యావిధానంపై లోతుగా అధ్యయనం జరగాలి. ఆధునిక భారతనిర్మాణం దిశగా ఇదో మైలురాయి అని బిజెపి నేతలు సహజంగానే ప్రకటించారు. నూతన విద్యావిధానం ద్వారా విద్యావ్యవస్థలో సంస్కరణలకు అవకాశం ఏర్పడిందని అంటున్నారు. ఈ విధానం యువతలో స్వయం సామర్థ్యాలను, పెంపొందించి.. ఆధునిక భారతం దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళుతుందని పేర్కొన్నారు. మరోవైపు నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం అనేది ఏకపక్ష విధానం అని.. భారత విద్యా వ్యవస్థను నాశనం చేస్తుందని లెఫ్ట్ పార్టీలు విమర్శిస్తున్నాయి. నూతన విద్యావిధానాన్ని అమోదించే క్రమంలో పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోవలేదన్నారు. నిజానికి మన విద్య అంతా మెకాలే సృష్టించిన చట్రంలో ఇమిడి ఉంది. భారతీయత అన్నది లేకుండా చేశారు. ఒకప్పటి పటిష్టమైన గురుకుల విద్యను నాశనం చేశారు. మన గురుకులాలు ఎంతగానో పటిష్టంగా పనిచేశాయి. అంతర్జాయంగా మన నలంద,తక్షశిల లాంటి విద్యాలాయాలు ప్రాచుర్యం పొందాయి. అలాంటి విద్యావిధానాన్ని కూడా సీమక్షించుకోవాల్సి ఉంది. ఇంకా ట్వింకిల్.. ట్వింకిల్ లిటిల్ స్టార్.....రెయిన్ రెయిన్ గో అవే అన్న ఇంగ్లీష్ తరహా విద్యను వదులు కోవాలి. మన దేశ ఔన్నత్యాన్ని నేటి తరం తెలుసుకునేలా పాఠ్యాంశాల్లో మార్పులతో ముందుకు సాగాలి. విద్యారంగ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ పక్షాలు ఈ అంశం మీద మరింతగా మేథోమథనం చేయాలి. నూతన విధానం అమలులోకి రావడానికి అనేక దశలు దాటవలసి వస్తుంది. ఈ సమయంలో అయినా చర్చ అర్థవంతంగా జరగవలసి ఉన్నది. నూతన జాతీయ విద్యా విధానం 2020, విద్యారంగంలో అనేక పెద్ద మార్పులను వాగ్దానం చేస్తున్నది. ప్రతిపాదించిన మార్పులన్నీ వాంఛనీయమైనవి కావన్న వ్యాఖ్యలు కూడా వినిపి స్తున్నాయి. కస్తూరిరంగన్ కమిటీ నివేదిక రెండేళ్ల కిందటే ప్రభుత్వానికి అందినా, దాన్ని పోయినేడాది పార్లమెంటు ముందుకు, ప్రజల ముందుకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి ఈ ఏడాది కాలంలో ఆ నివేదికపై విస్తృతంగా చర్చ జరిగిందని, ప్రజల నుంచి అనేక సూచనలు అందుకున్నామని ప్రభుత్వం చెబుతున్నది. అంతే కాదు, 2015 సంవత్సరం నుంచి ఈ విధాన రూపకల్పన అన్నిదశలలో 2 లక్షలకు పైగా సలహాలు, సూచనలు వచ్చాయని, అన్ని అంచెల స్థానిక సంస్థలు కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖతో సహకరిస్తూ, భాగస్వామ్యం వహించాయని ప్రభుత్వం పేర్కొన్నది. మన గురుకుల విద్య ఎప్పటి నుంచో బాగా ప్రాచుర్యం పొంది ఉన్నందున దానికి అనుగుణంగా ఉంటుందా అన్న చర్చ కూడా సాగాలి. ప్రాంతీయభాషల్లోనే ప్రాథమిక బోధన ఉంటుందని సెలవిచ్చారు. అనేక సబ్జక్టుల అధ్యయనం కూడా సెకండరీ స్థాయిలోనే మొదలవుతుంది. ఐదవ తరగతి దాకా, వీలయిన చోట్ల, మాతృభాష లేదా ప్రాంతీయ భాషలోనే విద్యాబోధన జరుపుతారు. పరీక్షలు జరిగే తరగతులు, జరిపే విధానం, మూల్యాంకన పద్ధతులు- మొదలయినవన్నీ మారిపోతాయి. ఇందులో ప్రధానంగా ఇంటర్ విద్య పూర్తిగా రద్దు అవుతోంది. రెండు సంవత్సరాల ప్రాథమిక పూర్వ విద్యతో కలుపుకుని సెకండరీ స్థాయి దాకా పదిహేను సంవత్సరాల విద్య, అనంతరం నాలుగు సంవత్సరాల పట్టభద్రవిద్య, తరువాత ఒకటి లేదా రెండు సంవత్సరాల వ్యవధితో స్నాతకోత్తర కోర్సులు- ఇదీ చదువుల క్రమంగా ఉంటుందని విశ్లేషించారు. పిహెచ్‌డికి ముందు ఎంఫిల్ రద్దు చేశారు. ఇకపోతే విద్యారంగ ప్రపంచీకరణకు అనుగుణంగా మన దేశంలోని చదువుల పద్ధతులను మార్చుకోవడం లక్ష్యంగా కనిపిస్తుంది. అది ఎంతమేరకు నిజమన్నదో చర్చ జరగాలి. నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు, క్రెడిట్ల ఆధారంగా విద్యార్థి స్థాయిని కొలిచే పద్ధతి, కోర్సునుంచి వైదొలగడానికి, పాక్షికంగా మాత్రమే చదువుకోవడానికి అవకాశం ఉండడం, మానవీయ, సామాజిక శాస్త్రాల, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల మేళవింపుతో పాఠ్యాంశాల ఎంపిక వంటి ప్రతిపాదనలన్నీ గ్లోబల్ నమూనాకోసం సంకల్పించినవే అని అంటున్నారు. . నూతన విధానం ద్వారా అనేక విదేశీ యూనివర్సిటీలు మనదేశంలో రకరకాల స్థాయిలలో పనిచేయడం సులువు అవుతుంది. బహుశా, భారతీయ యూనివర్సిటీలు కూడా కొన్ని, చిన్న చిన్న దేశాలలో వ్యాపారం చేయడం సాధ్యపడుతుందన్న భావనా ఉంది. మొత్తంగా సంస్కరణలతో మన విద్యార్థులు ప్రపంచ పోటీకి అనుగుణంగా రాటుదేలితే మంచిదే. అదే క్రమంలో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, మన చరిత్ర కూడా అధ్యయనంలో భాగం కావాలి. వక్రీకరించిన మన చరిత్ర పుటలను చించి పారేయాలి. అప్పుడే సమగ్ర విద్యావిధానంగా గుర్తించవచ్చు.

# కరోనాపై పోరులో విజయం సాధిస్తాం

### -కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి అవంతి

విజయవాడ,జూలై31(ఆర్ఎన్ఎ): మహమ్మారి కరోనాకు, మానవాళికి జరుగుతున్న పోరులో కచ్చితంగా మనుషులే విజయం సాధిస్తారని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. కరోనా సమాచారంలో ప్రభుత్వం పారదర్శకత పాటిస్తోందని.. అధిక సంఖ్యలో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వల్లే ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. వైరస్ సోకినా ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని.. తగిన జాగ్రత్తలు తీసుకుంటే మహమ్మారి నుంచి కోలుకోవచ్చని తెలిపారు. మంత్రి అవంతి శ్రీనివాస్ శుక్రవారం దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా బారి నుంచి ప్రజలను కాపాడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కోవిడ్?-19 కట్టడికై ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని.. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తాను సైతం ప్రతినెలా పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. టెస్టులు చేయించుకోవడంలో ఎలాంటి ఇబ్బంది, తప్పు లేదన్నారు. కరోనా సోకినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదని సరైన జాగ్రత్తలు, ఆత్మస్థైర్యంతో దానిని జయించవచ్చని పేర్కొన్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో కేసులు తగ్గుముఖం పడుతాయన్న అవంతి.. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రతీ విషయాన్ని తప్పు పట్టడం సరికాదని హితవు పలికారు.

# అమ్మవారి ఆలయంలో ఘనంగా వరలక్ష్మీవ్రతం

### ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వారికి ప్రసాదాలు

తిరుపతి,జూలై31(ఆర్ఎన్ఎ): చిత్తూరు జిల్లా తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం పూజలు వేడుకగా నిర్వహించారు. కరోనా నేపథ్యంలో ఏకాంతంగా అమ్మవారికి పూజలు జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం అయిదు గంటలకు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్ర నామార్చన, నిత్య అర్చన పూజలు చేశారు. అనంతరం మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో నేత్రపర్వంగా అభిషేకం చేశారు. అలంకార శోభితురాలైన అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయంలోని ముఖమండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శాస్త్రోక్తంగా వరలక్ష్మి పూజలు చేశారు. ఆన్‌లైన్ ద్వారా వ్రతం టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు అమ్మవారి ప్రసాదాలను పోస్టల్ ద్వారా వారి చిరునామాకు పంపనున్నారు. అమ్మవారి ఆలయ చరిత్రలో భక్తులు ఎవరూ లేకుండా వరలక్ష్మి వ్రతం నిర్వహించడం ఇదే తొలిసారి.

# పేదలకు వరంగా సిఎం సహాయనిధి: ఎమ్మెల్యే

మహబూబాబాద్,జూలై31(ఆర్ఎన్ఎ): పేదల పాలిట సీఎంఆర్ ఎఫ్ పథకం వరంలా మారిందని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే శంకర్ నాయక్ అందచేశారు. మహబూబాబాద్ పట్టణంలో అనారోగ్యానికి గురైన 18 మంది బాధితులకు మంజురైన ఆరు లక్షల పదమూడు వేల రూపాయలు (6,13,000) చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా.. ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు సైతం సీఎం కేసీఆర్ వర్తింపజేసి ఆదుకుంటున్నారని తెలిపారు.

# మెట్రో రైల్ స్టేషన్లకు మాజీ సిఎంల పేర్లు

### తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

చెన్నై,జూలై31(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ చెన్నైలోని మూడు ప్రధాన మెట్రో స్టేషన్లకు ముగ్గురు మాజీ ముఖ్యమంత్రుల పేర్లు పెడుతూ తమిళనాడు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. చెన్నైలోని అలందూర్ మెట్రో స్టేషన్‌కు అరిగ్నార్ అలందూర్ మెట్రో, సెంట్రల్ స్టేషన్‌కు పురచ్చి తలైవీ డా. ఎంజీ రామచంద్రన్ సెంట్రల్ మెట్రో, సీఎంబీటీ స్టేషన్‌కు పురచ్చి తలైవీ డా. జే జయలలిత సీఎంబీటీ మెట్రో స్టేషన్‌గా పేరు మార్పుచేసింది. ఈమేరకు ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకు స్టేషన్ల పేర్లు మార్చినట్లు సీఎం పళనిస్వామి ప్రకటించారు. చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశలో ఈ మూడు స్టేషన్లు ప్రధానమైనవి. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఐకానిక్ చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు ఏఐఏడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ పేరు పెడతామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.

# జాతీయోద్యమ ఆశయాలతో నాటి విద్యావిధానం

### నైపుణ్యాలను పెంచడం నేటి సంకల్పం
### ప్రైవేటు విద్యారంగాన్ని నియంత్రించే లక్ష్యాలు చెప్పాలి

న్యూఢిల్లీ,జూలై31(ఆర్ఎన్ఎ): పి.వి. నరసింహారావు మానవవనరుల శాఖ కేంద్రమంత్రిగా రూపొందిన నూతన విద్యావిధానం స్థానంలో కేబినేట్ ఆమోదించిన కొత్త విధానం అమలులోకి వస్తుంది. భారతదేశాన్ని సమూలంగా మార్చివేసే సంకల్పం కలిగిన ప్రస్తుత కేందప్రభుత్వం, అందుకు అత్యంత కీలకమయిన విద్యారంగంలో కూడా సంస్కరణల కోసం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే ప్రయత్నాలు ప్రారంభిం చింది. 1968లో అమలులోకి వచ్చిన విద్యావిధానం- జాతీయోద్యమ ఆశయాలను, సమానత్వ భావనలను, విద్యార్థి వ్యక్తిత్వ నిర్మాణాన్ని, సర్వతోముఖ వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, 2020 నాటి విద్యావిధానంలో అటువంటి కాలం చెల్లిన సంగతులేమీ లేవు. నైపుణ్యాలను పెంచడం ఒక్కటే పరమలక్ష్యంగా కనిపిస్తుంది. వృత్తి విద్యను పదో తరగతి, లేదా ఇంటర్మీడియేట్ తరువాత మాత్రమే ప్రారంభించాలనుకోవడంలో మన పూర్వ విధానకర్తల లక్ష్యంగా కనిపించింది.నూతన విద్యావిధానం రూపకల్పన చేసే కమిటీకి ప్రభుత్వం తరఫున కొన్ని సూచనాంశాలను అందించేందుకు టిఎస్ఆర్ సుబ్రమణియన్ చైర్మన్‌గా ఒక కమిటీని 2015లో నియమించారు. ఆయన 2016 మేలో నివేదిక సమర్పించారు. ఆ తరువాత ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ అధ్యక్షతన నూతన జాతీయవిద్యా విధాన రూపకల్పన కమిటీని నియమించారు.అది రెండేళ్ల కిందట నివేదికను సమర్పించింది. హిందీని తప్పనిసరి అభ్యసన భాషగా నిర్దేశిస్తూ తొలుత చేసిన సిఫారసును, అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన తీవ్ర నిరసనల తరువాత, తుది నివేదకలో తొలగించారు. ప్రభుత్వానికి సమర్పించిన 484 పేజీల నివేదికకు, ఆమోదించిన నివేదికకు మధ్య ఇంకా ఏయే మార్పులు జరిగాయో తెలియాల్సి ఉన్నది. సెకండరీ విద్య దాకా, అంటే పదో తరగతి దాకా, విద్య, అనేక జ్ఞానరంగాల మౌలిక అంశాలను బోధించాలి. విద్యార్థిని సామాజికుడిగా చేయడానికి కావలసిన విలువల విద్యను, సాధారణ పరిజ్ఞానాన్ని అందించాలి. వృత్తి విద్య పేరుతో ఆ మౌలిక శిక్షణకు గండి కొడితే, వ్యక్తి వికాసం అపరిపక్వం గా మిగిలిపోతుంది. ఆరవ తరగతి నుంచే కోడింగ్ వంటివి నేర్పాలన్నట్టుగా నివేదిక చెబుతున్నది. విద్యాభ్యా సానికి సాంకేతికతను వాడుకోవడం వేరు, విద్యార్థి దశలోనే ఉత్పాదకులుగా మారడం వేరు. వయసుకు మించిన వృత్తి విద్య నేర్పించడం విద్య మౌలిక లక్ష్యాలను దెబ్బతీస్తుంది. నైపుణ్యాల అవసరం ఉన్న మాట నిజమే, కానీ, ఎగుమతులకు మాత్రమేనా నైపుణ్యాలు? నైపుణ్యం, సాంకేతికత ఒక జత అనుకుంటే, అధ్యయనం, పరిశోధన మరో జత. రెండో జతను కూడా ప్రోత్సహిస్తేనే, నైపుణ్యాలు దేశీయంగా ఉపయోగ పడతాయి. విద్యాహక్కు చట్టం లక్ష్యాలకు, నూతన విద్యా విధానానికి వైరుధ్యాలు ఎదురవుతాయి. ప్రైవేటు విద్యారంగాన్ని నియంత్రించడానికి ఎటువంటి చొరవా ఈ విధానంలో కనిపించడం లేదు. పైగా, ఫీజుల నిర్ణయంలో ప్రైవేటు సంస్థలకు స్వేచ్ఛ ఉండాలన్నట్టుగా సూచనలు చేశారు. ఐదో తరగతి దాకా మాతృభాషలో విద్యాబోధన అన్న ప్రతిపాదనలోనే, వీలయిన చోట్ల, అని చెప్పి లొసుగు పెట్టారు. స్థూల జాతీయోత్పత్తిలో విద్యకు కేటాయింపులు 6 శాతం ఉండాలన్న లక్ష్యం విధించుకున్నారు. 2019 మార్చితో ముగిసిన విద్యాసంవత్సరంలో మనదేశంలో వెచ్చించినది కేవలం 3.1 శాతం. దాన్ని దాదాపు రెట్టింపు చేయడం ఇప్పట్లో సాధ్యమేనా? అన్నది చూడాలి. విద్య వైద్య రంగాలలో ప్రైవేటు యాజమాన్యాలను పెంచి పోషించిన తరువాత, విద్యకోసం, వైద్యం కోసం ప్రభుత్వ పెట్టుబడులు పెరుగుతాయా? అన్నది కూడా అనుమానమే. నూతన విధానంలో తలపెట్టిన విద్యాబోధన పద్ధతులను అమలుచేయాలంటే, ఉపాధ్యాయులకు అందుకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలి. నాలుగు సంవత్సరాల బిఎడ్ ఇంటిగ్రేటెడ్ కోర్సును ఉపాధ్యాయ పోస్టులకు కనీస అర్హతగా 2030 నాటికి అమలుచేయాలన్నది లక్ష్యం. అన్ని చోట్లా ప్రాథమిక పూర్వ తరగతుల ఏర్పాటు కూడా 2030 నాటికే పూర్తి కావాలి. ఈ విధానంలో తక్షణం అమలు అయ్యేవి, చేయగలిగేవి ఏమీ లేవు. ముందు ఈ విధానంపై రాష్ట్రాల అభిప్రాయసేకరణ జరగాలి. చట్టం కావాలి. అమలుకు కావలసిన ప్రాథమిక వ్యవస్థలు ఏర్పాటు కావాలి. అదంతా పెద్ద ప్రక్రియ. ఈ ప్రక్రియ మీద ఆసక్తి చూపి, మంచిచెడ్డల వివేచన జరిపితే, తగిన మరమ్మత్తులు సాధ్యం కావచ్చు.

# కరోనాతో 25కోట్ల మంది చదువులకు దూరం

### నామమాత్రంగానే సాగుతున్న బోధన

న్యూఢిల్లీ,జూలై31(ఆర్ఎన్ఎ): పాఠశాలలన్నీ నాలుగు నెలలుగా నిరవధికంగా మూతబడి వుండటం వల్ల దేశవ్యాప్తంగా 25 కోట్లమంది పిల్లలు చదువులకు దూరమయ్యారు. కొన్ని రాష్ట్రాలు ఏదో ఒక మేర దూరవిద్య విధానాన్ని అమలు చేయడం మొదలుపెట్టాయి. కానీ దాని ద్వారా లబ్ధి పొందుతున్న పిల్లల శాతం తక్కువే. ఇంటర్నెట్ సదుపాయం అంతంతమాత్రంగా వుండటం, అలాంటి సదుపాయం వున్నా ఖరీదైన ఉపకరణాలను కొనుక్కునే స్తోమత చాలామంది పిల్లలకు లేకపోవడం పర్యవసానంగా ఆన్‌లైన్ చదువులు నామమాత్రంగానే సాగుతున్నాయి. ఒక తరం చదువులకు దూరమైతే పిల్లలకు మాత్రమే కాదు... సమాజానికి కూడా ఎంతో నష్టం వాటిల్లుతుంది. దాన్నుంచి కోలుకోవడం కష్టమవుతుంది. అలాగని వైరస్ మహమ్మారిని రూపుమాపకుండా చదువులు మొదలుపెడితే పర్యవసానాలు తీవ్రంగా వుండే ప్రమాదముంటుంది. ఇప్పుడున్న స్థితిలో పిల్లలు ముప్పు బారిన పడకుండా చూడటం అతి ముఖ్యం.

ప్రజారోగ్య, సామాజిక, ఆర్థిక రంగాల సమస్యలతోపాటు పాఠశాల విద్యను మళ్లీ పట్టాలెక్కించడం కూడా సమస్యే. వైరస్ నియంత్రణలోకొచ్చాక తిరిగి ప్రారంభం కావాల్సిన కార్యకలాపాల్లో చదువులు అన్నిటి కన్నా ముఖ్యమైనవి. దాన్ని దృష్టిలో పెట్టుకునే పాఠశాలలు తిరిగి తెరవడంపైనా... ఈ విషయంలో తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తలపైనా సలహాలు, సూచనలు ఇవ్వాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఎవరు ఏ తేదీకి బడులు తెరవడానికి సంసిద్ధంగా ఉన్నారో చెప్పాలని సూచించింది. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ విషయంలో ఎటూ చెప్పలేకపోయాయంటేనే వైరస్ తీవ్రత ఎంత వుందో అర్థమవుతుంది. ఒక్క అస్సాం మాత్రం ఈ నెలాఖరున పాఠశాలలు తిరిగి తెరిస్తే బాగుంటుందని చెప్పగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మణిపూర్, నాగాలాండ్, రాజస్తాన్, అరుణచల్ ప్రదేశ్, ఒడిశా, లదాఖ్‌లు సెప్టెంబర్ నెలలో ప్రారంభించడం ఉత్తమమని అభిప్రాయపడ్డాయి. ఢిల్లీ, హరియాణ, బిహార్, చండీగఢ్ ఆగస్టులో పాఠశాలలు తెరిస్తే బాగుంటుందని సూచించాయి. తెలంగాణ, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్ తదితర 21 ప్రభుత్వాలు నిర్దిష్టంగా చెప్పలేకపోయాయి. రాష్ట్ర ప్రభుత్వాల సిలబస్‌లు చాలావరకూ బోధనకు పరిమితమై ఉంటాయి. తరగతి గదిలోని పిల్లలకు టీచర్ వచ్చి బోధించడం, పాఠ్యాంశాలపై అవగాహన కలి గించడం, వారి సందేహాలు తీర్చడం వగైరాలు అందులోవుంటాయి. ఐబీ, ఐజీసీఎస్‌ఈ వంటివి ఇందుకు భిన్నం. అందులో పిల్లలు ఒకరితో ఒకరు సంభాషించుకోవడం, చర్చించుకోవడం ఒక భాగం. విద్యార్థుల మధ్య ఆరేసి అడుగుల దూరం వుండేలా చూడటం, వారు చెట్టపట్టాలు వేసుకోకుండా చూడటం తప్పనిసరి. పిల్లలు భౌతికదూరం పాటించేలా చూడటం ముఖ్యం. అనారోగ్యం బారిన పడిన పిల్లలు బడికి రాకుండా తల్లిదండ్రులు ఏదోమేరకు జాగ్రత్తలు తీసుకుంటారన్నది మరీ ముఖ్యం.

ఈ ఏర్పాట్ల కోసం ఎన్నో వ్యయప్రయాసలు తప్పవు. అవసరమైన మానవ వనరులు అందుబాటులోకి తీసుకు రావాల్సివుంటుంది. ఈ కష్టకాలంలో పిల్లల్లో సహజంగానే భావోద్వేగాలు అధికంగా ఉంటాయి. తమ ఇంట్లోనో, తమ పొరుగునో సమస్యల్లో చిక్కుకున్నవారి గురించి విని భయాందోళనలతో వుంటారు. దానికి తోడు మునుపటిలా కదలికలుండవు గనుక ఒక రకమైన అసౌకర్యానికి గురవుతారు. తోటి పిల్లల్లో ఎవరికైనా అనారోగ్యం వస్తే ఇవన్నీ మరింతగా పెరుగుతాయి. కనుక సిలబస్ పూర్తి చేయాలన్న తొందరలో టీచర్లు ఒత్తిళ్లు తీసుకురాకూడదు. అసలు బోధనావిధానమే సంపూర్ణంగా మార్చు కోవాల్సి ఉంటుంది. బడులు తెరవడం అంటే వీటన్నిటి విషయంలో సర్వసన్నద్ధంగా వుండటం.

# ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ పునర్నియామకం

### అర్ధరాత్రి ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం

అమరావతి,జూలై31(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను మరోసారి నియమిస్తూ ప్రభుత్వం అర్ధరాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తిరిగి నియమిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు గవర్నర్ పేరిట పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేశారు. సుప్రీంలో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ తుది తీర్పునకు లోబడి నోటిఫికేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఎస్ఈసీగా ఉన్న సమయంలో కోవిడ్ 19 వ్యాప్తి చెందుతున్న తరుణంలో స్థానిక ఎన్నికలను వాయిదా వేశారు.

ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఆయనను పదవి నుంచి తొలగించారు. దీనిపై నిమ్మగడ్డ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేష్ కుమార్ తిరిగి నియమకం హర్షణీయమని లాయర్ నర్రా శ్రీనివాస్ పేర్కొన్నారు. హైకోర్టు ఎన్నిసార్లు చెప్పినా ఏపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టుకు వెళ్ళిందన్నారు. సుప్రీంకోర్టులో కూడా ఏపీ ప్రభుత్వానికి చుక్కెదురైందన్నారు. తప్పనిసరి పరిస్థితులలో ఏపీ ప్రభుత్వం నిమ్మగడ్డ కేసులో వెనక్కు తగ్గిందని నర్రా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ పని ముందే చేసి ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేదన్నారు. కోర్టు ఆదేశాలు అమలు చేయాలని మరల కోర్టులే కలుగు జేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ప్రభుత్వం [illegible] తీసుకోవాలన్నారు.న్యాయస్థానాలను, న్యాయ తీర్పులను గౌరవించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని నర్రా శ్రీనివాస్ పేర్కొన్నారు.

# కరోనా బారిన పడ్డ పెంపుడు కుక్క మృతి

### న్యూయార్క్‌లో యజమాని నుంచి వ్యాప్తి

న్యూయార్క్,జూలై31(ఆర్ఎన్ఎ): అమెరికాలో మొదటిసారి కరోనావైరస్ బారిన పడిన ఓ పెంపుడు కుక్క చనిపోయినట్లు నేషనల్ జియోగ్రాఫిక్ మ్యాగజైన్ ప్రచురించింది. న్యూయార్క్‌కు చెందిన రాబర్ట్ మహోని ఏప్రిల్‌లో కరోనా బారినపడ్డాడు. అతని ద్వారా ఆయన పెంపుడు కుక్క బడ్డీ కూడా కరోనా బారినపడింది. అయితే రాబర్ట్ కరోనా నుంచి కోలుకున్నాడు. కానీ బడ్డీ మాత్రం కోలుకోలేక పోయింది. బడ్డీ అమెరికాలోనే కరోనావైరస్ సోకిన మొదటి జంతువు. దాంతో బడ్డీ గురించి అమెరికా మొత్తం తెలిసిపోయింది. బడ్డీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటంతో పాటు.. ముక్కు కారడం వంటివి మొదలై.. వారాలు గడిచేకొద్దీ తీవ్ర అనారోగ్యం పాలైంది. జూలై 11న రక్తం కక్కడం, మూత్ర విసర్జనలో రక్తం పడటం, నడవలేకపోవడం జరిగాయి. అయితే రాబర్ట్ భార్య అల్లీసన్ వెంటనే బడ్డీని వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని అనుకుంది. కానీ, కరోనా వల్ల ఆస్పత్రులన్నీ మూతపడి ఉన్నాయి. దాంతో బడ్డీకి సరైన వైద్యం అందక మృతిచెందినట్లు అల్లీసన్ తెలిపింది.

# అర్థరాత్రి ఇంటిపై దుండగుల దాడి

హైదరాబాద్,జూలై31(ఆర్ఎన్ఎ): మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మిర్జాల్ గుడాలో ఉన్న ఓ ఇంటిపై బుధవారం అర్ధరాత్రి సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. అందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ టీవీలో రికార్&ధ అయ్యాయి. అయితే తాము దళితులమనే తమ ఇంటిపై దాడి చేశారని ఇంటి యజమాని సునీల్ దత్ కాంబ్లే అన్నారు. దాడిలో ఇంటి ముఖద్వారం, బయట ఉన్న వాహనాల అద్దాలను ధ్వంసం చేశారని చెప్పారు. జరిగిన సంఘటన మొత్తం సి.సి టీవీల్లో రికార్డ్ అవ్వడంతో బాధితుడు మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. దాడికి స్థల వివాదమే కారణమని స్థానికులు చెబుతున్నారు. జరిగిన దాడిని ఖండిస్తూ నిందితులని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘ నాయకులు బాధితుడికి అండగా నిలిచారు.

# ఎపిలో మరో 68మంది మృతి

విజయవాడ,జూలై31(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 18,90,077 శాంపిల్స్‌ను పరీక్షించారు.మరోవైపు గడచిన 24 గంటల్లో కరోనా నుంచి కోలుకున్న 4,618 మంది ఆస్పత్రుల నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు కరోనా నుంచి కోలుకున్నవారి సంఖ్య 60,024కి చేరింది. కొత్తగా కరోనాతో 68 మంది మృతిచెందడంతో.. మొత్తం మరణాల సంఖ్య 1,281గా నమోదైంది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. బుధవారం ఉదయం 9 గంటల నుంచి గురువారం ఉదయం 9 గంటల వరకు 70,068 శాంపిల్స్‌ను పరీక్షించగా 10,167 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 1,30,557కి చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో 69,252 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి.

# ఎనిమిదేళ్ల బాలికపై పాశవికంగా అత్యాచారం

### ఆపై హత్య చేసిన యువకుడి అరెస్ట్

లక్నో,జూలై31(ఆర్ఎన్ఎ): ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ముజాఫర్ నగర్ జిల్లాలోని ఓ గ్రామంలో ఎనిమిదేండ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడి అనంతరం గొంతు కోసి హత్య చేశాడు. ముజాఫర్‌నగర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన 22 ఏండ్ల సునీల్‌కుమార్ స్థానికంగా చిన్నచిన్న పనులు చేసుకుంటూ ఆవారాగా తిరిగేవాడు. గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఎనిమిదేండ్ల బాలికను అపహరించి చెట్ల పొదల్లలోకి ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం విషయం ఎవరికైనా చెబుతుందనే భయంతో కత్తితో బాలిక గొంతు కోసి హత్య చేసి మృతదేహాన్ని చెరకు తోటలో పడేసి వెళ్లిపోయాడు. బాలిక కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం చెరకు తోటలో బాలిక మృతదేహాన్ని గుర్తించి స్థానికుల అనుమానం మేరకు సునీల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో శుక్రవారం ఉదయం సునీల్‌ను అరెస్టు చేసినట్లు డిప్యూటీ ఎస్పీ ఆశిశ్ ప్రతాప్ తెలిపారు.

# పేకాట క్లబ్‌తో తనకు సంబంధం లేదు

**–అర్బన్ ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే శ్రీదేవి**

గుంటూరు,జులై31(ఆర్ఎన్): పేకాట క్లబ్ వ్యవహారంలో తనపై జరుగుతున్న కుట్రను చేదించాలని అర్బన్ ఎస్పీ అమ్మిరెడ్డికి ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎస్పీని శ్రీదేవి కలిశారు. తనపై కావాలనే కొంత మంది కుట్ర చేస్తున్నారని, విజయవాడ కేంద్రంగా మీడియాకు తప్పుడు సమాచారం ఇచ్చి వార్తలు వేయిస్తున్నారని ఆరోపించారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై డీజీపీని కూడా కలుస్తానని తెలిపారు. డాక్టర్‌గా పని చేసిన మహిళ ఎమ్మెల్యేపై కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని శ్రీదేవి మండిపడ్డారు. తనతో ఫోటోలు దిగినంత మాత్రనా తన అనుచరుడు అనడం సబాబు కాదన్నారు. నియోజకవర్గం లోని ప్రజలు అందరు తన సన్నిహితులేనని ఆమె చెప్పారు. తనపై జరుగుతున్న రాజకీయ కుట్రపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని శ్రీదేవి ప్రకటించారు. పేకాట క్లబ్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని.. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పేకాట జరుగుతున్న నంబూరు గ్రామం తర నియోజకవర్గం కాదు. పక్క నియోజకవర్గంలో పేకాట జరిగితే తాడికొండ నియోజకవర్గానికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

# దుర్గమ్మ ఆలయ అభివృద్ధికి డోనర్స్ ముందుకు రావాలి

**–ఆలయ చైర్మన్ పైలా సోమినాయుడు**

విజయవాడ,జూలై31(ఆర్ఎన్): విజయవాడ కనకదుర్గ గుడిలో శాశ్వత కేశఖండన శాల నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామని ఆలయ చైర్మన్ పైలా సోమినాయుడు అన్నారు.ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందు రావాలని కోరారు. డోనర్స్ సెల్ ఒకటి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గురువారం మూడు గంటల పాటు కొనసాగిన పాలకమండలి సమావేశం ముగిసింది. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కరోనా బారిన పడిన సిబ్బందిని ఆలయపరంగా ఆదుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆలయ ఈవో సురేష్ బాబు మాట్లాడుతూ.. పాలకమండలి సమావేశంలో 38 అంశాలపై చర్చించామని తెలిపారు. శివాలయం పునర్నిమాణం, అన్నదానం, ప్రసాదం పోటు, కేశఖండన శాల నిర్మాణం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులకు సంబంధించి అనుమతులు కూడా వచ్చాయని తెలిపారు. తూర్పు రాజగోపురం నుండి దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో దాతలు భాగస్వాములు అవ్వాలని కోరారు. సిబ్బందికి కోవిడ్ ఇన్సూరెన్స్ కల్పించేలా కమిషనర్ దృష్టి కి తీసుకు వెళతామన్నారు. భక్తులు నిర్భయంగా దర్శనానికి రావచ్చని, ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. లాక్ డౌన్ ఎత్తేస్తే దర్శన సమయంలో మార్పులు చేస్తామని వ్యాఖ్యానించారు

# అంధుల ఆశ్రమంలో ఒకరికి కరోనా

తిరుపతి,జులై31(ఆర్ఎన్): అంధుల ఆశ్రమంలో దారుణం చోటుచేసుకుంది. అంధుల ఆశ్రమంలో ఓ వ్యక్తి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. కరోనా వచ్చిన వ్యక్తిని క్వారంటైన్‌కు పంపకుండా, సొంత ఊరికి వార్డెన్ పంపారు. సహచరుల సాయంతో క్వారంటైన్‌లో అంధుడైన కరోనా బాధితుడు చేరాడు. అంధుల హాస్టల్ నుంచి మిగిలిన 22 మందిని కూడా ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆహార సరఫరా కూడా వార్డన్ నిలిపివేశాడు. దీంతో ఆకలితో అలమటిస్తున్నారు. తమకు ఎవ్వరూ లేరని, భౌతికదూరం పాటిస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకుని హాస్టల్‌లోనే ఉంటామని అంధులు వేడుకుంటున్నారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇస్తే హాస్టల్‌లో ఉండనిస్తామని అధికారులు చెబుతున్నారు.

# కరోనా కేసులు పెరుగుతున్న పట్టింపు లేదు

**చంద్రబాబు సిఎంగా ఉంటే ఈ కష్టాలు ఉండేవి కావు**

**టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు**

అమరావతి,జూలై30(ఆర్ఎన్): రాష్ట్రంలో కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతుండడం చాలా దురదృష్టకరమని టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. దీనిపై ప్రజలు, ప్రతిపక్షం ప్రశ్నిస్తే వాళ్లపై దాడులు, కేసులు పెడుతున్నారని విమర్శించారు. కరోనా కష్టకాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రి గా ఉంటే.. ఈ కష్టాలు ఉండేవికాదని ప్రజలు ఆలోచిస్తున్నారని అన్నారు. గతంలో హుద్ హుద్ తుపాన్ వస్తే వారం రోజుల్లో పరిస్థితిని చక్కబరిచారన్నారు. తుపాన్‌కు అతలాకుతలమైన విశాఖను మళ్లీ సుందర నగరంగా తీర్చిదిద్దారన్నారు.ముఖ్యమంత్రి జగన్ కరోనా వ్యాప్తి నివారణలో పూర్తిగి విఫలమయ్యారని రామానాయుడు విమర్శించారు. రాష్ట్ర సమస్యలను పక్కనపెట్టి పంచాయతీ కార్యాలయాలకు మళ్లీ రంగులు ఎలా వేసుకోవాలన్నదానిపై నిమగ్నమయ్యారన్నారు. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న మండలిని ఏ విధంగా రద్దు చేయాలి, మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను ఎలా పంపించాలి, రాజధాని బిల్లులు ఏ విధంగా ఆమోదించుకోవాలన్న వాటిపై దృష్టి పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో విజృంభిస్తున్న కోవిడ్ నియంత్రణపై దృష్టి పెట్టాల్సిన ముఖ్యమంత్రి తన విలువైన సమయాన్ని ఇటువంటి విషయాలపై దృష్టి పెట్టడంవల్లే రాష్ట్రంలో కరోనా కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయని రామానాయుడు ఆరోపించారు.

# సకాలంలో రైతువేదికల నిర్మాణం పూర్తి: కలెక్టర్

కుమ్రం భీం ఆసిఫాబాద్,జూలై30(ఆర్ఎన్ఎ): : జిల్లాలో చేపట్టిన రైతు వేదికల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 70 రైతు వేదికలు ఉండగా దాదాపుగ అన్ని చోట్ల పనులు ప్రారంభమయ్యాయని, ఆగస్టు 15 లోగా అన్ని వేదికల నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. అదే విధంగా జిల్లాలో ఈ వర్షాకాలం సాగుచేస్తున్న పంటలపై ప్రస్తుతం సర్వే జరుగుతోందని, ఈ సర్వే 75 శాతం పూర్తయిందని తెలిపారు. రేపటిలోగా పంటల సర్వే పూర్తి చేసి ఆన్ లైన్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్డీఏ పీడీ శైలేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

# కేంద్ర విద్యావిధానంపై సర్వత్రా హర్షం

**స్వాగతించిన పలువురు ప్రముఖులు**

**బడ్జెట్ కేటాయంపులు ఖచ్చితం చేయాలని సూచన**

అమరావతి,జూలై31(ఆర్ఎన్ఎ): కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని స్వాగతిస్తున్నట్లు అధికార విపక్షనేతలు కూడా ప్రకటించారు. ఇది తమ ఆంగ్ల విధానానికి వ్యతిరేకం కాదని ఏపి విద్యాశ్శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ప్రకటించారు. దాదావుగా జనగ్ విధానాలకు అనుగుణంగానే ఉందన్నారు. అలాగే కేంద్ర జాతీయ విద్యావిధానాన్ని పలువురు విద్యారంగ ప్రముఖులు కూడా స్వాగతించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కూడా తన అనుకూలతను ప్రకటించారు. 5వ తరగతి వరకు మాతృభాషలో విద్యాబోధన ఉండాలని ఆ విధానంలో చెప్పడాన్ని ఆయన స్వాగతించారు. యువత ప్రపంచంతో పోటీ పడే విధంగా ఈ విద్యా విధానం సమూల మార్పులకు నాంది పలుకుతుందని, అంతర్జాతీయ స్థాయిలో మన విద్యార్థులను తయారు చేయడానికి దోహదపడుతుందని అనేకుఉల పేర్కొన్నారు. ఇకపోతే చాలామంది విద్యారంగానికి నిధుల కేటాయింపులో స్పష్టత ఉండాలని అన్నారు. కేంద్ర జీడీపీలో 10శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం విద్యా రంగానికి కేటాయించాలని సూచించారు. యూజీసీని ఇతర వాటిలో విలీనం చేయడం వల్ల రాష్ట్రాలపై భారం పడుతుందని అభిప్రాయపడ్డారు. విద్యా రంగంపై రాష్ట్రాలకు అధిక భాగసామ్యం కల్పించాలన్నారు. ప్రీ ప్రైమరీ విద్యను తప్పనిసరి చేయడం హర్షణీయమని, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని అన్నారు. ఇప్పటివరకూ 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకే నిర్బంధ విద్య అమల్లో ఉందని, ఇప్పుడు అది 3 నుంచి 18 ఏళ్ల వరకు పెరగడం మంచి పరిణామన్నారు.విద్యా వ్యవస్థలో మార్పులపై మేధావుల సూచనలను పట్టించుకోకపోవడం గర్హణీయమని ఏపీటీఎఫ్ ప్రతినిధులు అన్నారు. ప్రస్తుతం మనుగడలో లేని సంస్కృత భాషను 1వ తరగతి నుంచి ప్రవేశపెట్టడం అంటే బీజేపీ భావజాలాన్ని బలవంతంగా రుద్దడమేనని విమర్శించారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ఈ విద్యా విధానం ఉందన్నారు.అన్ని వర్గాలతో సమగ్రంగా చర్చించిన తర్వాతే నూతన విద్యా విధానాన్ని ఆమోదించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ నేతలు సూచించారు. కరోనా సమయంలో హడావిడిగా ఈ విధానాన్ని ఆమోదించడం సరికాదన్నారు. 3, 5, 8 గ్రేడ్లలో పరీక్షలు తప్పనిసరి చేయడం వల్ల పిల్లలపై ఒత్తిడి తీవ్రంగా పెరుగుతుందని యూటీఎఫ్ నేతలు అన్నారు. 5వ గ్రేడ్ వరకూ విద్యను మాతృభాషలోనే అందించాలని తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఇకపోతే పాఠశాలలకూ అక్రిడిటేషన్ విధానం పెట్టడం వల్ల పేదలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందేందుకు అవకాశం ఉందని పలువురు ప్రముఖులు అన్నారు. ఇకపై అంగన్‌వాడీలన్నీ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మారతాయన్నారు. అయితే ప్రత్యేక శిక్షణ పొందినవారే వీటిలో పనిచేయాలని అభిప్రాయపడ్డారు.

# పొరుగుదేశాల అభివృద్ధికి భారత్ అండ

**వారితో సఖ్యతతో ముందుకు వెళుతున్నాం**

**మారిషస్ సుప్రీంకోర్టు భవన ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,జూలై31(ఆర్ఎన్ఎ): ఇరుగుపొరుగుదేవాలతో సఖ్యతగా ఉంటూ... వారి అభివృద్ధికి భారత్ ఎప్పుడూ సహకరిస్తోందిన ప్రధాని మోడీ అన్నారు. ఇతర దేశాలకు తమవంతుగా అవసరమైన సాయం అందిస్తూనే ఉన్నామని అన్నారు. మారిషస్ కొత్త సుప్రీంకోర్టు భవనాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ, మారిషస్ ప్రధాని ప్రవీండ్ జుగ్నాత్ సంయుక్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ప్రారంభించారు. ఇరు దేశాల స్వతంత్ర న్యాయవ్యవస్థలు మన ప్రజాస్వామ్య వ్యవస్థలకు ముఖ్యమైన స్తంభాలని మోదీ ఈ సందర్భంగా అన్నారు. ఆధునిక డిజైన్, నిర్మాణంతో ఆకట్టుకునే ఈ కొత్త భవనం ఈ గౌరవానికి గుర్తు అని తెలిపారు. భారత్, మారిషస్ మధ్య అభివృద్ధి, సహకారం ఎటువంటి షరతులతో కూడినది కాదన్నారు. హిందూ మహా సముద్రం ప్రాంతాల అభివృద్ధి విధానమైన 'సాగర్ – సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ రీజియన్' గురించి తొలుత మారిషస్‌తోనే మాట్లాడినట్లు గుర్తు చేశారు. కరోనాను సమర్థవంతంగా నియంత్రిస్తున్న మారిషస్ ప్రభుత్వం, ఆ దేశ ప్రజలను అభినందిస్తున్నట్లు మోదీ తెలిపారు. అఫ్గాన్ పార్లమెంట్ భవన నిర్మాణంలోనూ తాము కీలకంగా వ్యవహరించామని అన్నారు. మరోవైపు తమ దేశ సుప్రీంకోర్టు కొత్త భవనం నిర్మాణానికి సహకరించిన భారత్‌కు మారిషస్ ప్రధాని ప్రవీంద్ జుగ్నాత్ ధన్యవాదాలు తెలిపారు. మోదీజీని తమ దేశం, తమ ప్రజలు ఎల్లప్పుడు గుర్తు చేసుకుంటారని హిందీలో అన్నారు. భారత ప్రభుత్వ సహకారం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' విలువలను సమర్థిస్తున్నాయని ఆయన కొనియాడారు.

# కరోనా నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**ఖమ్మంలో కోవిడ్ టెస్ట్ సెంటర్లు ప్రారంభించిన ఈటెల**

ఖమ్మం,జూలై31(ఆర్ఎన్ఎ): జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో ఏర్పాటు చేసిన కరోనా వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఖమ్మంలోని మమత దవాఖనలో కొవిడ్ పరీక్షల నిర్ధారణ కేంద్రాన్ని మంత్రి ఈటల ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అవసరమైన పరీక్షలు నిర్వహించేందుకు వైరస్ నిర్ధారణ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కరోనా వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇకపోతే కరోనా వైరస్ నివారణకు ప్రభుత్వ పటిష్టమైన చర్యలకు తీసుకుంటోందని ఈటల రాజేందర్ తెలిపారు. వైరస్‌కు భయపడాల్సిన పనిలేదని, ఎక్కడికక్కడ కరోనా పరీక్షలు చేస్తున్నామని స్పష్టం చేశారు. దేశంలో పలు రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణలో కరోనా కట్టడి చేయడంలో కొంతమేర విజయం సాధించామని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో వైరస్ అంత తక్కువ సమయంలో తగ్గే అవకాశం లేదని, సహజీవనం చేస్తూ ముందుకెళ్లాల్సిందేనని చెప్పారు. దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ సడలింపులతోనే కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య విపరీతంగా పెరిగిన మాట వాస్తవమని ఈటల అభిప్రాయపడ్డారు. దేశంలో పలు రాష్ట్రాల్లోకరోనా బీభత్సం సృష్టిస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం నామమాత్రపు సాయం మాత్రమే చేసిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం, సిఎం కెసిఆర్ ముందస్తు చర్యలు తీసుకుని ముందుకు వెళుతున్నారని అన్నారు.

ఇక వైరస్ ప్రభావం చూస్తుంటే 81శాతం మందికి కరోనా వచ్చి, పోయే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెప్పారని మంత్రి స్పష్టం చేశారు. అలాగే వైరస్ లక్షణాలున్న ప్రతి ఒక్కరికీ టెస్టులు చేస్తున్నామని, మొబైల్ టెస్ట్ లేబొరేటరీల ద్వారం పరీక్షల నిర్వహణ ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చిందన్నారు. కరోనా విషయంలో విపక్షాలు కావాలనే రచ్చ చేస్తున్నాయని, దేశ వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రజలంతా ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలని, ప్రతివక్షాల మాటలు పట్టించుకోవద్దని తెలిపారు. దేశ వ్యాప్తంగా ముంబై, ఢిల్లీ, కోల్‌కల్తా, చెన్నై వంటి పెద్ద నగరాల్లో కేసుల సంఖ్య విపరీతంగా ఉందని, హైదరాబాద్‌లోనూ అదే రీతిలో ఉందని చెప్పుకొచ్చారు. అయితే పరీక్షల సంఖ్యను పెంచడంతో కొంతమేర కట్టడి చేయగలుగుతున్నామని పేర్కొన్నారు.

# మారిషస్ నూతన సుప్రీంకోర్టు భవన ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగానికి తెలుగు అనువాదం.

హైదరాబాద్, జులై 31:రిపబ్లిక్ ఆఫ్ మారిషస్ ప్రధానమంత్రి, గౌరవనీయులు ప్రవింద్ కుమార్ జుగనౌత్ జీ, సీనియర్ మంత్రులు, మారిషస్ కు చెందిన ఇతర ప్రముఖులు, విశిష్ట అతిథులకు , నమస్కారం, శుభోదయం.

మీ అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ముందుగా , మారిషస్ ప్రభుత్వం, ప్రజలు కోవిడ్ –19 మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొంటున్నందుకు మీకు అభినందనలు.సకాలంలో మందులు పంపించడం, తన అనుభవాలను పంచుకోవడం వంటి వాటి ద్వారా ఇండియా ఈ కృషికి మద్దతు తెలపగలిగినందుకు నాకు సంతోషంగా ఉంది.

మిత్రులారా, ఇవాళ మనం ఇండియా – మారిషస్ లమధ్య ప్రత్యేక స్నేహంలో మరో మైలురాయివంటి కీలక ఉత్సవాన్ని జరుపుకుంటున్నాం.పోర్టు లూయిస్ లోని సుప్రీం కోర్టు భవనం, మన మధ్యసహకారానికి, మన ఉమ్మడి విలువలకు గుర్తుగా ఉంటుంది.ఇండియా, మారిషస్ లు తమ ప్రజాస్వామిక వ్యవస్థల ప్రధాన స్థంభాలుగా, స్వతంత్ర న్యాయవ్యవస్థలను గౌరవిస్తాయి. అద్భుతమైన ఈ నూతన భవనం దీని ఆధునిక డిజైన్, నిర్మాణం ఈ గౌరవానికి సూచికగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్టు నిర్ణీత సమయంలో, ముందు అంచనా వేసిన ఖర్చు పరిమితిలోనే పూర్తి అయినందుకు సంతోషంగా ఉంది.

ప్రధానమంత్రి జుగనౌత్‌జీ, కొద్ది నెలల క్రితమే మనం, ప్రతిష్ఠాత్మక మెట్రో ప్రాజెక్టును , అత్యధునాతన ఆస్పత్రిని సంయుక్తంగా ప్రారంభించాం. ఈ రెండు ప్రాజెక్టులూ మారిషస్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిసి సంతోషంగా ఉంది.

మిత్రులారా, భారతదేశ, సాగర్ (ఎస్.ఎ.జి.ఎ.ఆర్)– సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్ గురించి నేను మొదటి సారిగా మారిషస్ లోనే మాట్లాడాను. ఎందుకంటే, హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత విధానానికి మారిషస్ కీలకంగా ఉంది. ఇవాళ, అభివృద్ధి భాగస్వామ్యంలోనూ విధానంలోనూ భారత్ హృదయస్థానంలో ఉంది .మిత్రులారా, మహత్మాగాంధీ ఒక మాట చాలా చక్కగా చెప్పారు. దానిని నేను ఇక్కడ ప్రస్తావిస్తాను : నేను కూడా మొత్తం ప్రపంచం దృష్టిలో నుంచి ఆలోచించాలనుకుంటున్నాను. నా దేశభక్తిఅంటే, మొత్తంగా మానవాళికి మంచి జరగడం కూడా. అందువల్ల నేను భారతదేశానికి సేవచేయడమంటే, మానవాళికిసేవ చేయడం కూడా. ఇది భారతదేశానికి దిశానిర్దేశం చేసే తాత్వికత. భారతదేశం అభివృద్ధి చెందాలని అనుకుంటోంది. అలాగే ఇతరులకు ,వారి అభివృద్ధి అవసరాలలో సహాయపడాలని ఇండియా భావిస్తున్నది.మిత్రులారా, భారతదేశ అభివృద్ధి విధానం ప్రధానంగా మానవీయ కేంద్రితమైనది. మేం మానవాళి సంక్షేమానికి పాటుపడాలని అనుకుంటున్నాం. అభివృద్ధి భాగస్వామ్యం పేరుతో, దేశాలు బలవంతంగా ఇతరులపై ఆధారపడే భాగస్వామ్యంలోకి వెళ్ళిపోవడం మనకు చరిత్ర తెలియజేసింది. ఇది మనకు వలస, సామ్రాజ్యవాద పాలననిచ్చింది.ఇది అంతర్జాతీయంగా పవర్ బ్లాక్ లు ఏర్పడడానికి కారణమైంది. అంతిమంగా మానవీయత దెబ్బతినింది.మిత్రులారా, ఇండియా వైవిధ్యం, గౌరవంతో కూడిన అభివృద్ధి భాగస్వామ్యాలను అనుసరిస్తున్నది.భవిష్యత్తు పట్ల , సుస్థిరాభివృద్ధి పట్ల శ్రద్ధ కలిగిఉంది.

మిత్రులారా, భారతదేశానికి, అభివృద్ధి సహకారంలో అత్యంత ప్రధానమైన సూత్రం , మన భాగస్వాములను గౌరవించడం. అభివృద్ధి పాఠాల ఈ భాగస్వామ్యం మా ఏకైక ప్రేరణ. అందువల్ల మన అభివృద్ధి సహకారం ఎలాంటి షరతులతో రాలేదు. ఇది రాజకీయ లేదా వాణిజ్య పరమైనఅంశాల ద్వారా ఎన్నటికీ ప్రభావితం కాదు.

మిత్రులారా,

భారతదేశ అభివృద్ధి భాగస్వామ్యాలు వైవిధ్యంతో కూడుకున్నవి. ఇవి వాణిజ్యం నుంచి సాంస్కృతికం వరకు, ఇంధనం నుంచి ఇంజనీరింగ్ వరకు, ఆరోగ్యం నుంచి గృహనిర్మాణం వరకు, ఐటి నుంచి మౌలిక సదుపాయాల వరకు , క్రీడలనుంచి శాస్త్రవిజ్ఞానం వరకు, ఇండియా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలతో కలిసి పనిచేస్తున్నది.ఆఫ్ఘనిస్థాన్ లోని పార్లమెంటు భవనం నిర్మాణంలో సహాయం చేసినందుకు భారతదేశం గౌరవించబడినట్టే. నిజర్ లో మహాత్మా గాంధీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంతో సంబంధం కలిగి ఉండటం కూడా మాకు గర్వంగా ఉంది. అత్యవసర ట్రామా ఆస్పత్రి నిర్మాణం ద్వారా నేపాల్ ఆరోగ్య సేవలు మెరుగు పరచుకోవడానికి సహాయం చేసినందుకు మాకు ఆనందంగా ఉంది. శ్రీలంకలోని మొత్తం 9 ప్రావిన్సులన్నింటా అత్యవసర అంబులెన్సు సేవలు కల్పించేందుకు శ్రీలంక కృషికి మద్దతు ఇవ్వడం మాకు సంతోషంగా ఉంది. నేపాల్ తో మేము చేపట్టిన చమురు పైప్ లైన్ ప్రాజెక్టు పెట్రోలియం ఉత్పత్తుల అందుబాటుకు సహాయపడుతుందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. అలాగే, మాల్దీవులకు చెందిన 34 దీవులకు మంచినీరు అందుబాటులోకి తేవడం, పారిశుధ్యానికి మావంతు సాయం చేయడం మాకు ఆనందంగా ఉంది.ఆఫ్ఘనిస్థాన్, గుయానాలలో క్రికెట్‌ను పాపులర్ చేయడానికి మేం అక్కడ స్టేడియంల నిర్మాణం , ఇతర సదుపాయాలు కల్పించడానికి ప్రయత్నించాం.ఇండియాలో శిక్షణ పొందిన యువ ఆఫ్ఘన్ క్రికెట్ టీమ్ బలమైన జట్టుగా ఎదగడం చూసి మేము సంతోషిస్తున్నాము. మేం ఇప్పుడు , మాల్దీవుల క్రికెట్ క్రీడాకారుల ప్రతిభకు పదును పెట్టడానికి అలాంటి మద్దతునే అందిస్తున్నాము. శ్రీలంకలో ప్రధాన గృహ నిర్మాణ ప్రాజెక్టులో ఇండియా ముందుభాగాన ఉండడం గర్వకారణంగా భావిస్తున్నాం. మా అభివృద్ధి భాగస్వామ్యం, మా భాగస్వామ్య దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలను ప్రతిబింబిస్తుంది.

మిత్రులారా, ఇండియా ప్రస్తుతం వర్తమానానికి సహకరించినందుకు మాత్రమే గర్వించడంలేదు. మీ యువతకు మంచి భవిష్యత్తు ను కల్పించేందుకు సహాయం చేయడం మా బాధ్యతగా మేం భావిస్తాం.అందుకే శిక్షణ,నైపుణ్యాలు మా అభివృద్ధి సహకారంలో అత్యంత కీలకమైనవి. ఇవి మా భాగస్వామ్య దేశంలోని యువతను స్వావలంబకులుగా తీర్చిదిద్దుతాయి. ఆ రకంగా భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు నడిపించడానికి వారు మరింత విశ్వాసం కలిగి ఉంటారు. మిత్రులారా, భవిష్యత్తు సుస్థిరాభివృద్ధిది. మానవ అవసరాలు, ఆకాంక్షలు మన సహజ పరిసరాలతో విభేదించేవిగా ఉండరాదు.అందుకే మేం మానవ సాధికారత, పర్యావరణం పట్ల శ్రద్ధ కలిగి ఉంటాం. ఈ తాత్వికత ఆధారంగా , ఇండియా అంతర్జాతీయ సౌర కూటమి వంటి కొత్త సంస్థల ఏర్పాటుకు కృషి చేసింది. మానవ ప్రగతి ప్రస్థానాన్ని సూర్యకిరణాలు ప్రకాశమానం చేయుగాక. అలాగే విపత్తులనుంచి తట్టుకునే బలమైన మౌలిక సదుపాయాలపై కూడా మేం గట్టిగా పనిచేస్తున్నాం. ఈ రెండూ, దీవులైన దేశాలకు ప్రత్యేకంగా పనికివచ్చేవి. ఈ కృషికి ప్రపంచ దేశాలు కలిసి వస్తున్న తీరు సంతోషం కలిగిస్తున్నది.మిత్రులారా, నేను ప్రస్తావించిన ఈ విలువలన్నీ, మారిషస్‌తో మా ప్రత్యేక బంధంలో ఒక్కటిగా కలిసి ఉన్నాయి.మేం హిందూ మహాసముద్ర జలాలను మాత్రమే కాదు బంధుత్వం, సంస్కృతి , భాషల సాధారణ వారసత్వాన్ని కూడా పంచుకుంటున్నాము. మా స్నేహానికి బలం గతం నుంచి వచ్చినది. అది భవిష్యత్ దిశగా చూస్తున్నది. మారిషస్ ప్రజల విజయాలను భారతదేశం గర్వంగా భావిస్తుంది. ఆప్రవాసి ఘాట్ పవిత్ర సన్నని మెట్ల దారుల నుంచి, ఆధునిక మారిషస్ నిర్మాణం వరకు మారిషస్ విజయాలు కష్టపడడం ద్వారా ఆవిష్కరణలద్వారా సాధించినది. మారిషస్ స్ఫూర్తి ఎంతో ప్రేరణాత్మకం. మన భాగస్వామ్యం రాగల సంవత్సరాలలో మరింత ఉన్నత శిఖరాలకు చేరగలదు.

# దళిత రైతు ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత

**–కోటి పరిహారం చెల్లించి ఆదుకోవాలి: టిడిపి నేత రమణ**

హైదరాబాద్,జూలై31(ఆర్ఎన్ఎ): ఆత్మహత్య చేసుకున్న దళిత రైతు కుటుంబానికి తక్షణం కోటి రూపాయాల పరిహారం చెల్లించాలని టిడిపి డిమాండ్ చేసింది. రైతు ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యతని టీడీపీ తెలంగాణ అధ్యక్షులు ఎల్. రమణ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని వర్గాల మండలం వేలూరు గ్రామంలో దళిత రైతు నర్సింహులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని రమణ అన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యని చెప్పారు. దళితులు భూములు అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. నర్సింహులు కుటుంబాన్ని ప్రభుత్వం కలవాలని, ఇతర రాజకీయ పక్షాలు కలవడానికి పరామర్శించడానికి అమతించాలన్నారు. నర్సింహులు కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వాలని రమణ డిమాండ్ చేశారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని అన్నారు. ఎస్సీ కులానికి చెందిన నర్సింహులు మృతికి కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులపై దాడులు చేయిస్తూ వారి మరణానికి కారణమవుతున్నారని ఆరోపించారు. నర్సింహులు మరణానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రమణ డిమాండ్ చేశారు. నర్సింహులు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాల న్నారు. దళితులకు మూడు ఎకరాల ఇస్తామని మోసం చేసి ఇప్పుడు ఉన్న భూమి దౌర్జన్యంగా గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోనే ఇంత దారుణమా అంటూ ప్రశ్నించారు

# తెలంగాణ సన్నాలకు బ్రాండ్ ఇమేజ్

**ఐఎస్‌బి సహకారంతో అగ్రివర్సిటీ ఒప్పందం**

హైదరాబాద్,జూలై31(ఆర్ఎన్ఎ): సన్నబియ్యానికి ఉన్న డిమాండ్ దృష్ట్యా వాటినే పండించాలన ఇసిఎం కెసిఆర్ రైతులను పదేపదే కోరారు. ఈ క్రమంలో సన్నాలను పండించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన తెలంగాణ సోనాకు బ్రాండ్ ఇమేజ్ తీసుకు వచ్చేందుకు సన్నాహలు చేస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయ విశ్వవిద్యాయం ఇండియన్‌స్కూల్‌ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బి)తో ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ సన్నాలకు బ్రాండ్ ఇమేజ్‌తీసుకు రావడం, మార్కెటింగ్ వంటి పక్రియలను ఐఎస్‌బి నిర్వహించనుంది. తెలంగాణ సోనా వెరైటీ రైస్‌కు ఇప్పటికే ఆదరణ పెరిగింది. సోనా మసూరీకి ధీటుగా తెలంగాణ సోనాకు డిమాండ్ పెరిగింది. ఈ పంట ఉత్పత్తి కూడా బాగా జరుగుతోంది. నాణ్యమైన ధాన్యం వస్తోంది. తక్కువ సమయంలో వీటిని పండించడానికి రైతులకు ఎంతో అనుకూలంగా ఉందని అంటున్నారు. 125 నుంచి 150 రోజుల్లోనే పంట చేతికి వస్తుంది. వ్యవసాయానికి ఎంతో అనువుగా వున్నవంగడంగా అధికారులుపేర్కొంటున్నారు. దీంతో రైతులు వానాకాలంలోనూ, యాసంగిలోనూ పండించేందుకు అనువుగా అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ సోనా నాణ్యత బాగుందని, ధాన్యం బియ్యంగా మారే క్రమంలో బ్రోకెన్ పర్సంటేజ్ కూడా చాలా తక్కువగా ఉందని తెలిపారు. రైతులు ఎక్కువ లాభాలు పొందడానికి ఈ ప్రీమియం ప్యాడీ వెరైటీ అవకాశం కల్పిస్తుంది. తెలంగాణసోనా ధాన్యాన్నిబియ్యంగా మార్చేక్రమంలో బ్రోకెన్‌శాతం తక్కువ ఉండడం, తర్వాత మిల్లింగ్ తర్వాత బ్రోకెన్‌రైస్‌తో మంచి ఉత్పత్తులు తీసుకు వచ్చే అవకాశం ఉందని మిల్లర్లు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సోనాలో తక్కువస్థాయిలో గ్లైసమిక్ శాతం తక్కువగా ఉండడం వల్ల దయాబెటిక్ ఉన్నవారికి ఈ బియ్యం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఇతర పేరు పొందిన వెరైటీలకంటే ఇది ఎంతో ఉత్తమమని అన్నారు. ప్రొటీన్, కార్బొహైడ్రేట్స్, ఎనర్జీ, నియాసిన్( విటమిన్ బి3) వంటివి కూడా తెలంగాణ సోనాలకు అధికంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ డా. జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన తెలంగాన సోనా ఆరోగ్య పరంగా పోషక విలువ అధికంగా ఉన్నట్టు తేలిందన్నారు. దయాబెటిక్ రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తేలిందన్నారు. ఈ వెరైటీకి మరింత ప్రచారం కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

# తాజా రాజకీయ పరిణామాలపై కాంగ్రెస్ దృష్టి

**పార్టీ రాజ్యాసభ సభ్యులతో సోనియా చర్చలు**

న్యూఢిల్లీ,జూలై31(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన సభ్యులతో ఆ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గురువారం సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులతో పాటు పార్టీ సీనియర్లు మన్మోహన్ సింగ్, ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, గులాం నబీ ఆజాద్, ఆనంద్ శర్మ, మల్లిఖార్జున ఖర్గే, అంబికా సోని, చిదంబరం, జైరాం రమేశ్ కూడా పాల్గొన్నారు. దేశంలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, కొవిడ్ నివారణ చర్యలతో పాటు ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సోనియా పార్టీ నాయకులతో చర్చించారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ఎంపీలకు సోనియా సూచించారు. కొవిడ్ 19 కేసులు పెరిగిపోతుండడంతో ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. కొద్దిరోజుల క్రితం లోక్‌సభ ఎంపీలతో కూడా సోనియా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# విశాఖ జైలులో కరోనా కలకలం

**–మృతి చెందిన మొద్దుశీను హంతకుడికీ పాజిటివ్**

విశాఖపట్నం,జూలై31(ఆర్ఎన్ఎ): విశాఖ సెంట్రల్ జైల్లో కరోనా వైరస్ కలకలం రేపింది. కారాగారంలోని 10 మంది సిబ్బంది, 27 మంది జీవితఖైదీలకు తాజాగా నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్‌గా తేలింది. మాజీమంత్రి, టీడీపీ నేత పరిటాల రవీంద్ర హత్య కేసులో ప్రధాన నిందితుడైన మొద్దు శ్రీనును హత్య చేసి ఓం ప్రకాశ్‌కు కూడా పాజిటివ్‌గా తేలింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఓం ప్రకాశ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహానికి కరోనా టెస్ట్ నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మరోవైపు పాజిటివ్‌గా తేలిన ఖైదీలను వైద్యుల సూచనల మేరకు క్వారెంటైన్ కేంద్రాలకు తరలిస్తున్నారు. మరికొంతమంది రిమాండ్ ఖైదీలకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

# జయ ఆస్తుల స్వాధీనానికి ఆర్డినెన్స్

**తమిళనాడు ప్రభుత్వం జారీ**

**వేద నిలయం కోసం కోర్టులో 67కోట్లు జమ**

చెన్నై,జూలై31(ఆర్ఎన్ఎ): తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకొనేందుకు తమిళనాడు ప్రభుత్వం ఆర్డినెన్స్ ప్రకటించింది. జయలలితకు చెందిన 10,000 కు పైగా బట్టలు, 8000 పుస్తకాలు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకోనున్నారు. జయలలితకు చెందిన వాహనాలు, స్థిర ఆస్తులకు సంబంధించిన జాబితా కూడా సిద్ధం చేశారు. జయలలిత నివాసం అయిన వేద నిలయంకు రాష్ట్ర ప్రభుత్వం స్మారక చిహ్నం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ కారణంగా జయలలిత దుస్తులు, పుస్తకాలు, వ్యక్తిగతంగా ఉపయోగించిన అనేక విలువైన వస్తువులు సహా అన్ని ఆస్తులను ప్రభుత్వం కొనుగోలు చేసింది. విశేషమేమిటంటే, తమిళనాడు ప్రభుత్వం దివంగత ముఖ్యమంత్రి జయలలిత నివాసమైన వేదనిలయంను సొంతం చేసుకోవడానికి చెన్నైలోని సివిల్ కోర్టులో రూ.67 కోట్లు జమ చేసింది. జయలలిత ఆస్తులపై మద్రాస్ హైకోర్టు ద్వారా చట్టబద్ధమైన వారసులుగా ప్రకటించి హక్కులు ఇచ్చినందున జయ స్మారక చిహ్నాన్ని నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేసేందుకు జయలలిత మేనకోడలు దీపా, మేనల్లుడు దీపక్ సిద్ధమయ్యారని వార్తలు వినిపిస్తున్నాయి. ఆదాయపు పన్ను, ఆస్తిపన్ను బకాయిలు చెల్లించడానికి రూ.36.9 కోట్లు చెల్లించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖకు జయలలిత రుణపడి ఉన్నారు. పన్ను చెల్లించిన తర్వాత.. దాని మార్గంలో ఉన్న అన్ని అడ్డంకులు తొలగించబడతాయి. 0.55 ఎకరాల ఆస్తిని స్మారక చిహ్నంగా మార్చే బాధ్యత ఏఐఏడీఎంకే పార్టీకి ఉన్నదని, అధికార ఏఐఏడీఎంకే పేర్కొన్నది. 2017 లో ముఖ్యమంత్రిగా పళనిస్వామి అధికారం చేపట్టిన తరువాత కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత సుదీర్ఘ అనారోగ్యంతో 2016 డిసెంబర్‌లో మరణించారు.

# తల్లిపాలు శ్రేష్టమైన పోషకాహార నెలవు

**(1-7 ఆగష్టు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా)**

నవజాత శిశువు పుట్టిన ఘడియల నుండి కనీసం ఆరు మాసాలు తప్పక తల్లిపాలు పట్టాలని, వీలైతే ఒకటి రెండు సంవత్సరాలు అదనపు ఆహారంతో పాటు అమ్మపాలు తాగించాలి. శిశుజననంతో పాటు మె?దటి గంటలో లభించే పచ్చని ముర్రుపాలు బిడ్డకు ప్రథమ వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తూ, వ్యాధుల నుండి రక్షించే యాంటీబాడీలు, ఖనిజాలు, మాంసకృత్తులు, విటమిన్-ఏ లాంటి అనేక పోషక విలువలు ఉంటాయి. ముర్రుపాల ద్వారా శిశువు పేగులు శుద్ధి చేయబడడం, ఎలర్జీలను నిరో?ధించడం కూడా జరుగుతుంది. శ్రేష్టమైన సంపూర్ణ పోషకాహారంగా తల్లిపాలు బిడ్డకు జీవితాంతం ఆరోగ్యం మరియు ప్రత్యేక పోషకాలు అందించబడుతూ, అనేక ప్రమాదకర వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తూ, శారీరక మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందనే సత్యాన్ని స్త్రీమూర్తులకు మరియు తండ్రులకు తెలియజేయడమే లక్ష్యంగా ప్రతియేటా ఆగష్టు 1 నుండి 7వ తేదీ వరకు విశ్వవ్యాప్తంగా "ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు"జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 'ప్రపంచ తల్లిపాల ప్రోత్సాహకర కూటమి' నేతృత్వంలో 1992లో ప్రారంభమైన ఈ చనుబాల వారోత్సవాలను 170కి పైగా ఐరాస సభ్యదేశాలలో స్థానిక ప్రభుత్వాలు, యూనిసెఫ్ మరియు ప్రపంచ ఆరోగ్య సంస్థలు సంయుక్తంగా ఘనంగా నిర్వహించడం జరుగుతోంది. అమృతతుల్యమైన అమ్మపాలలో శిశువు సమగ్రాభివృద్ధికి కావలసిన ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఐరన్, కాల్షియం, కొవ్వులు మరియు అనేక ఇతర పోషకాలు సమపాళ్ళలో అందించబడతాయి. భవిష్యత్తులో న్యుమోనియా, కలరా, పచ్చకామెర్లు లాంటి అనేక రోగాలు రాకుండా నిరోధించడానికి అమ్మపాలు దోహదపడతాయి. తల్లిపాలు బిడ్డకే కాకుండా తల్లికి కూడా అత్యంత మేలును చేస్తున్న కారణంగా సామాన్యులు, తండ్రులు మరియు ప్రధానంగా స్త్రీలలో సంపూర్ణ అవగాహన కల్పించి రేపటి ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలనే ప్రచారం జరుగుతోంది. ఆరు నెలల తరువాత ఎదిగే పిల్లలకు మరియు పెద్దలకు ఉత్తమ పోషక విలువలుగల ఆవు లేదా గేదెపాలను అదనంగా తాగించడం మంచిది. ప్రపంచవ్యాప్తంగా 7.6 మిలియన్ల శిశువులకు తల్లిపాలు అందడం లేదనేది వాస్తవం. అధిక ఆదాయ వర్గాల పిల్లల్లో 21 శాతం, మధ్య తరగతిలో 4 శాతం శిశువులకు తల్లిపాల రుచి తెలియనే తెలియదు. ఇండియా, చైనా, నైజీరియా, మెక్సికో, ఇండోనేషియా దేశాలకు చెందిన 2.36 లక్షల పిల్లలు తల్లిపాలు దొరక్క మరణిస్తున్నారు.

తల్లిపాలను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వాలు ప్రసూతి సెలవుల సౌకర్యాన్ని ఉద్యోగినులకు కల్పించుట జరిగింది. కొన్ని దేశాలలో తండ్రులకు కూడా ప్రసవ సమయంలో ప్రత్యేక సెలవులు మంజూరు చేస్తున్నారు. తల్లితో పిడ్డకు తొలి ఆత్మీయ స్పర్శానుబంధం పెనవేసుకోవడానికి తల్లి రొమ్ముపాలు అపూర్వ వారధిగా పనిచేస్తాయి. బిడ్డకు తల్లిపాల పట్టించడం ద్వారా తల్లికి రొమ్ము క్యాన్సర్, ఓవేరియన్ క్యాన్సర్, టైప్-2 డయాబెటిస్, స్థూలకాయం, రక్తస్రావం, గుండె జబ్బులు, వెంటనే గర్భం దాల్చే అవకాశం లాంటివి రాకుండా అడ్డుకుంటాయి. తల్లిపాలను బిడ్డకు పట్టించడం వల్ల ప్రతియేటా 20,000లకు పైగా తల్లులను రొమ్ము క్యాన్సర్ నుండి రక్షించవచ్చని తేల్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నియమాల ప్రకారం నవజాత శిశువు జన్మించిన ఒక గంట నుండి కనీసం ఆరు మాసాలు వరకు తల్లిపాలను తప్పక తాగించాలి. క్రమంగా కొంత ఘన పోషకాహారాన్ని అదనంగా అందిస్తూ రెండు సంవత్సరాల వరకుతల్లిపాల అందించడం బిడ్డకు చాలా మంచిది. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2020 నినాదంగా "తల్లిపాల మద్దత్తుతో ఆరోగ్యకర భూగ్రహ స్థాపన" తీసుకోబడింది. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు బాధ్యతగల పౌరులు, వివిధ స్వచ్ఛంధ సంస్థలు కూడా తల్లిపాలు పట్టించడాన్ని ప్రోత్సహించడం, మద్దత్తునివ్వడం, రక్షించే చర్యలు చేపట్టడం జరుగుతోంది. కోవిడ్-19 కల్లోలంలో పిల్లలలో ఆదిలోనే ఆరోగ్యానికి పునాది వేయడం మరియు వ్యాధినిరోధకశక్తిని పెంపొందించుటలో తల్లిపాలు ప్రధానమని గుర్తుంచుకోవాలి. తల్లిపాలను పట్టించడంతో అమ్మ శారీరక సౌంధర్యం తరుగుతుందనే దురభిప్రాయాన్ని పక్కన పెట్టి, తల్లులందరు తమ పిల్లలకు రొమ్ముపాలు అందించడం వల్ల బిడ్డల సంపూర్ణ శారీరక మానసిక వికాసం సక్రమంగా జరుతుందని నమ్మాలి. తల్లిపాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేసినప్పటికి 50 శాతం తల్లులు ఆరు మాసాలు మాత్రమే రొమ్ముపాలు అందిస్తున్నారని, 25 శాతం అమ్మలు ఒక సంవత్సరం వరకు ఇస్తున్నారని తేలడం విచారకరం. పేదరికం, అవిద్య, అధిక జనాభా లాంటి సమస్యలున్న దేశాల్లో తల్లి ఆరోగ్యం సహకరించక, అవగాహన మరియు సమయం లేక, పిల్లలకు తల్లిపాలు సమృద్ధిగా అందడం లేదు. దీని వల్ల పిల్లలు పోషకాహార లోపంతో చిన్నతనంలోనే బలహీనంగా ఉంటూ, రోగాలపాలు కావడం జరుగుతుంది.

ప్రపంచంలోనే ఆర్థికంగా 5వ పెద్ద దేశమైన ఇండియాలో తల్లపాల ప్రాముఖ్యతను పెంపొందించే కార్యక్రమాలకు అతి తక్కువ ఖర్చు చేస్తున్నారు. దీని పర్యవసానంగా శిశు మరణాలు, తల్లిపాల లోపంతో అనారోగ్య శిశువుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ 14 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం జరుగుతోందన అంచనా. తల్లిపాల లోపంతో న్యుమోనియా, డయేరియా లాంటి వ్యాధులతో ప్రతియేటా దాదాపు లక్ష మంది పిల్లలు మరణించడం విస్మయానికి గురిచేస్తున్నది. భారతదేశంలో 54.9 శాతం తల్లులు మాత్రమే ఆరు నెలల వరకు తల్లిపాలు అందిస్తున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. మన దేశంలో 78.9 శాతం ప్రసవాలు ఆరోగ్యకేంద్రాలలో జరిగినప్పటికి, బిడ్డ జన్మించిన గంటలోపు తల్లిపాలు అందించే తల్లులు 42.6 శాతం మాత్రమే ఉన్నారు. తల్లిపాలు అందని కారణంగా మరియు పోషకాహారలోపం వల్ల ఐదు సంవత్సరాల లోపు పిల్లల మరణాల రేటు ఎక్కువగా ఉండడం జాతికి అవమానకరమని గుర్తించాలి. మె?దటి ఆరు మాసాలు ఏ ఇతర ఆహారం అందించకుండా (ఔషధాలు, ఓఆర్‌యస్ లాంటి అత్యవసరాలు మినహా) తల్లిపాలు మాత్రమే అందించడం శ్రేయస్కరం. భారత్‌లోని పిల్లల్లో 95 శాతం మంది చిన్నారులు ఏదో ఒక దశలో తల్లిపాలు తాగినవారే అని విశ్లేషించారు. సంపన్న కుటుంబాల తల్లుల కంటే పేదవర్గాల తల్లులు ఎక్కువగా తమ పిల్లలకు చనుబాలు పట్టిస్తున్నారనే విషయం విస్మయాన్ని కలిగిస్తున్నది. శిశు జననంతోనే తల్లి పాలు సహజంగా ఉత్పత్తి జరగడం, ఏమీ తెలియని బిడ్డ చనుబాలు పీల్చడం, తల్లీబిడ్డల మధ్య అవిచ్ఛిన్న ప్రేమానుబంధాలు జనించడం ఒక అద్భుత సృష్టి ధర్మంగా వస్తున్నది. పాల పొదులు, పాల సీసాలు, పోత రాలకు స్వస్తి పలికి, అమ్మగా తన బిడ్డకు తల్లిపాలను అందిస్తూ, తల్లి బిడ్డలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లి ఆరోగ్యకర సమాజ స్థాపనకు దోహదపడాలని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# తెలుగు మీడియం ఉండాల్సిందే అంటున్న నిపుణులు

## జాతీయ విద్యావిధానంతో మార్పు తప్పదని హెచ్చరికలు

అమరావతి,జూలై 31(ఆర్ఎన్ఎ): ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీషు మీడియం కొనసాగించేలా వైకాపా కృతనిశ్చయంతో ఉన్నట్లుగా ఉంది. ప్రాథమిక స్థాయిలో కేంద్ర కేబినెట్ ఆమోదించిన జాతీయ విద్యావిధానంలో ఒకటి నుండి ఐదవ తరగతి వరకు మాతృభాషలో విద్యాబోధన చేయాలని పేర్కొన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంగ్లీషు మీడియంను కొనసాగిస్తామని ప్రకటించింది.

అయితే, తెలుగు మీడియం కూడా ఉంటుందని తెలిపింది. జాతీయవిద్యా విధానంలో అవకాశం వున్నంత వరకు మాతృభాష లేదా స్థానిక భాషలో విద్యావిధానం వుండాలని కేంద్రం చెప్పింది. రెండు నుండి ఎనిమిది ఏళ్ల వయసు మధ్య ఉన్న పిల్లలు భాషలు త్వరగా నేర్చుకోగలరని, దీనికి మీడియం ఒక్కటే కారణం కాదని విద్యా విధానంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మెజారిటీ తల్లితండ్రులు తమ పిల్లలకు ఇంగ్లీష్ మీడియంనే కావాలని కోరుతున్నారని ప్రభుత్వం చెబుతోంది. ఆంగ్ల మాధ్యమంలోనే విద్యాబోధన సాగించాలనే జగన్ ప్రభుత్వానికి మరో ప్రతిబంధకం ఎదురైంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన తప్పనసిసరి అంటూ నూతన జాతీయ విద్యావిధానంలో కేంద్రం తేల్చి చెప్పడం.. 2020-21 నుంచి 1-6 తరగతులకు ఆంగ్ల మాధ్యమంలో బోధనకు సంసిద్ధమైన జగన్ సర్కారుకు ఈ పరిణామం చెంపపెట్టు లాంటిదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి 1-6 తరగతులకు ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్న జగన్ సర్కారు విధానంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. త్వరలో తీర్పు రావాల్సిన తరుణంలో, మాతృభాషలో బోధన తప్పనిసరి అని కేంద్రం నూతన విద్యావిధానంలో స్పష్టం చేయడంతో జగన్ సర్కారు తన నిర్ణయాన్ని మార్చుకోవాల్సిన పరిస్థితి అనివార్యమని పలువురు అంటున్నారు.

సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం 1-6 తరగతులకు ఆంగ్ల మీడియం పాఠ్యపుస్తకాలను సిద్ధం చేసింది. దీనికి కోట్ల రూపాయలు వ్యయం చేసింది. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా దూకుడు ప్రదర్శిస్తూ వచ్చింది. మాతృభాషాభిమానులు, భాషా పండితులు, భాషా కోవిదులు, ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు అందరూ తప్పు పట్టినా ఫలితం లేకుండా పోయింది. ఇంగ్లీషు మాధ్యమానికి అనుకూలంగా పేరెంట్స్ కమిటీలతో ప్రభుత్వం తీర్మానాలు చేయించింది. 'మీ పిల్లలకు ఏ మీడియం కావాలో చెప్పండి' అంటూ ఆప్షన్ ఫారాలు ఇచ్చి వలంటీర్ల ద్వారా అభిప్రాయ సేకరణ తంతు నడిపించింది. ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని స్వయంగా ప్రధాని, ఉపరాష్ట్రపతి సహా ఎందరెందరో చెప్పినా కించిత్తు ఆలోచన చేయకపోగా, ఎదురు దాడికే సీఎం పూనుకున్నారు. 1-6 తరగతుల పాఠ్యపుస్తకాలను సమూలంగా మార్చి.. ఒకే పాఠ్యపుస్తకంలో ఇంగ్లీషుతోపాటు తెలుగు మీడియంలోనూ పాఠ్యాంశాలను ముద్రించారు. రెండు మీడియంలలోనూ ముద్రించామని, అయితే పిల్లలు ఇంగ్లీషు మీడియంనే కోరుకుంటున్నారని న్యాయస్థానాల్లో చెప్పాలన్న ఆలోచనతోనే ఇలా చేశారు. అయితే, ఆ ప్రయత్నాలకు నూతన విధానంతో కేంద్రం అడ్డుకట్ట వేసింది. గత విద్యావిధానంలో ప్రాథమిక విద్య వరకు మాతృభాషలోనే బోధన చేయాలని పేర్కొన్నా, విద్యా హక్కు చట్టం-2009లోనూ అదే స్పష్టం చేసినా, న్యాయ స్థానాల్లోనూ అడుగడుగునా ముక్కెదురవుతున్నా, ఇంగ్లీషు మీడియం బోధన నిర్ణయాన్ని సమర్థించుకుంటూనే ప్రభుత్వం ముందుకెళ్తూ వచ్చింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో జరుగుతున్న కేసును కూడా కొనసాగిస్తామని చెప్పారు. తల్లితండ్రుల కమిటీలు చేసిన తీర్మానాలను ఇప్పటికే కోర్టుకు నివేదించామని తెలిపారు. విద్యారంగానికి ఎన్నడూలేని ప్రాదాన్యతను తమ ప్రభుత్వం ఇస్తోందన్నారు. ప్రభుత్వ రంగంలో మొదటిసారి ప్రి ప్రైమరీ విద్యను కూడా తీసుకువస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. అలాగే తెలుగును ఎక్కడా నిర్లక్ష్యంచేయడం లేదని అన్నారు. ప్రతి ఒక్కరు తమ గ్రామానికి ఇంగ్లీషు మీడియం వస్తుందని ఎదురుచూస్తున్నారని చెప్పారు. పూర్తిగా తెలుగు మీడియమే ఉండాలంటే ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు రెండింటిలోనూ అమలు చేయాలని చెప్పారు. కేంద్రం ఆమోదించిన జాతీయ విద్యా విధానంను సంపూర్ణంగా ఆహ్వానిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అందరికి ఆమోదయోగ్యమైన విద్యావిధానంను రూపొందించిందన్నారు. జాతీయ విద్యావిధానంలోని సిఫార్సులలో ఎక్కువ బాగం ఏడాదికాలంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న రాష్ట్ర విద్యావిధానంను పోలివుండడం తమకు గర్వకారణమన్నారు. ప్రీ ప్రైమరీ స్కూల్స్‌ను పెట్టాలని సూచించిందని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో ఎల్‌కెజి, యుకెజిలను బోధిస్తున్నామని తెలిపారు.

# ఉమ్మడి జిల్లాలో ఆగన కరోనా వ్యాప్తి

## గ్రామాల్లో సైతం విస్తరిస్తున్న కరోనా కేసులు
## ప్రజాప్రతినిధులకు పాజిటివ్‌తో సర్వత్రా ఆందోళన

నిజామాబాద్,జూలై31(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లాలో ప్రజాప్రతినిధులను కరోనా వెన్నాడుతోంది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు చికిత్స పొందుతున్నారు. బోధన్ మున్సిపల్ టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ గుణ ప్రసాద్(50) గురువారం తెల్లవారుజామున కరోనా అనుమానిత లక్షణాలతో హైదరాబాద్‌లో మృతి చెందారు.నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో కరోనా వైరస్ విస్తరిస్తోంది. ఇటీవల కాలంలో జిల్లాలో 50కి పైగా కేసులు నమోదుకాగా గురువారం ఒక్కరోజు వంద కేసులు నమోదు కావడం ఆందోళన కల్గిస్తోంది. మరి కొన్నిచోట్ల మరణాలు సంభవిస్తుండడంతో ప్రజలు మరింత కలవ రపడుతున్నారు. జిల్లాలో సామాన్య ప్రజల నుంచి ప్రభుత్వ ఉద్యోగు లు, పోలీసులు, వైద్యులు, రెవెన్యూ, గ్రామపంచాయతీ సిబ్బంది కరోనా బారిన పడడంతో జిల్లా వాసులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రితో పాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇంట్లో ఒకరికి వస్తే చాలు ఇంటిలాపాది చుట్టేస్తుండడంతో ఒకరితో ఒకరు మాట్లాడాలంటేనే జంకే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వైరస్ విజృంభిస్తున్నప్పటి నుంచి ముందుండి సేవలు అందిస్తున్న వైద్య, పోలీస్, రెవెన్యూ ఉద్యోగులు సైతం కరోనా బారిన పడుతుండడంతో వారి కుటుంబాలు సైతం కలవ రపడు తున్నారు. బోధన్ మున్సిపాలిటీలో సీనియర్ కౌన్సిలర్‌గా గుర్తింపు ఉన్న ఆయన న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన మృతిపట్ల బోధన్ ఎమ్మెల్యే షకీల్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సతీమణి బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తుండగా ఆమె కొన్ని రోజుల క్రితం కొవిడ్ బారిన పడింది. ఆమెకు కరోనా పాజిటివ్ రావడంతో ఆమె కుటుంబం హోం క్వారంటైన్‌లో ఉంది. మూడు రోజుల క్రితం గుణప్రసాద్‌కు తీవ్ర అస్వస్థతకు గురై శ్వాస సంబంధమైన ఇబ్బంది ఏర్పడడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన గురువారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో మృతి చెందారు. ఆయనకు కరోనా పాజిటివ్ ఉన్నట్లు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. కరోనా వ్యాధితో బోధన్‌కు చెందిన ఓ ఎల్ఐసీ ఏజెంట్ గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మృతి చెందారు. రెంజల్‌కు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ బోధన్‌లో నివాసం ఉంటూ ఏజెంట్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల ఆయనకు కరోనా పాజిటివ్ రావడంతో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయనకు శ్వాస సంబంధమైన ఇబ్బందులు ఏర్పడడంతో చికిత్స పొందుతూ మృతిచెందారు. బోధన్‌లో ఎలక్ట్రానిక్ మీడియా లో పనిచేస్తున్న ఇద్దరు జర్నలిస్టులకు కరోనా పాజిటివ్‌గా తేలింది. వీరిలో ఒకరు బోధన్ మండలం సాలూర పీహెచ్‌సీ పరిధిలో కరోనా పరీక్షలు నిర్వహించుకోగా, ఇంకొకరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నిర్వమించుకున్నారు. కోటగిరి మండలంలో మూడు కరోనా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు మండల వైద్యాధికారి సమత తెలిపారు. కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో తొమ్మిది మందికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, బోధన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులకు, మండలంలోని కారేగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కి కరోనా పాజిటివ్ వచ్చిందని ఆమె తెలిపారు. చందూరు మండల కేంద్రంలో ఇద్దరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వీరిలో ఒకరు సింగరేణిలో ఉద్యోగిగా పనిచేస్తుండగా మరొకరు ఇతర ఉద్యోగం చేస్తున్నారు. దీంతో గ్రామంలో నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ కర్లం సాయిరెడ్డి తెలిపారు. ధర్పల్లి మండల కేంద్రంలో మరొకరికి కరోనా పాజిటివ్ వచ్చింది. గ్రామంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో నలుగురికి కరోనా పరీక్షలు నిర్వహించగా బీసీ కాల నీకి చెందిన యువకుడికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ముగ్గురికి పాజిటివ్ రాగా ప్రస్తుతం వారు కరోనా నుంచి కోలుకుంటున్నారు. పాజిటివ్ వచ్చిన యువకుడిని హోంఐసోలేషన్ చేశారు. గ్రామస్థులు అత్యవసరముంటే తప్పా బయటకు రావద్దని సర్పంచ్ బాల్‌రాజ్ సూచించారు.

# కోవిడ్-19 రోగులకు ఉచిత పరీక్ష మరియు చికిత్సా సౌకర్యాలు ప్రారంభించిన - అఖిల భారత ఆయుర్వేద సంస్థ.

హైదరాబాద్, జులై 31:కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి శ్రీ శ్రీపాద యశో నాయక్ ఇటీవల ప్రకటించిన విధంగా న్యూఢిల్లీ లోని అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏ.ఐ.ఐ.ఏ), తన కోవిడ్-19 ఆరోగ్య కేంద్రం (సి.హెచ్.సి) లో రోగులకు ఉచిత పరీక్ష మరియు చికిత్సను అందించడం ప్రారంభించింది.

కోవిడ్-19 రోగుల చికిత్స కోసం కేంద్రంలో ఏర్పాట్లను సమీక్షించడానికి శ్రీ నాయక్ 2020 జూలై, 28వ తేదీన సి.హెచ్.సి. ని సందర్శించారు. రోగులందరికీ సి.హెచ్.సి. ఉచితంగా పరీక్ష, చికిత్సా సౌకర్యాలు కల్పిస్తుందని తమ పర్యటన సందర్భంగా మంత్రి ప్రకటించారు. వెంటిలేటర్ సదుపాయంతో పాటు ఐ.సి.యు. కు ఉండవలసిన అన్ని ఇతర ప్రామాణిక నిబంధనలతో సి.హెచ్.సి. లో ఏర్పాటు చేసిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను కూడా ఆయన ప్రారంభించారు.

ఏ.ఐ.ఐ.ఏ. ను కోవిడ్-19 పరీక్షల (ఆర్.టి-పి.సి.ఆర్. మరియు రాపిడ్ యాంటిజెన్ టెస్టింగ్) కేంద్రంగా ఢిల్లీ ప్రభుత్వం నియమించింది. సాధారణ ప్రజలు టెలిఫోను ద్వారా అడిగే, కోవిడ్-19 కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు అందించడానికి వీలుగా ఏ.ఐ.ఐ.ఏ. వద్ద ఒక కోవిడ్ కాల్ సెంటరు ను ఏర్పాటుచేశారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, అశ్వగంధ, వేప, కాలమేఘా, తిప్పతీగ మొదలైన వాటితో కూడిన వ్యాధి నివారణ, నిర్మూలన, ఆరోగ్య సంరక్షణ మరియు పరిశోధనాశాలలలో ఈ సంస్థకు ముఖ్యమైన పాత్ర ఉంది.

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 80,000 మంది ఢిల్లీ పోలీసు సిబ్బంది కోసం నిర్వహిస్తున్న రోగనిరోధక కార్యక్రమం 'ఆయురక్ష' ను మంత్రి ప్రశంసించారు. కోవిడ్-19 కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరులో ముందు వరుసలో యోధులుగా సేవలందిస్తున్న ఢిల్లీ పోలీసులకు రోగనిరోధక శక్తిని పెంచడం కోసం, అలాగే కోవిడ్-19 కు వ్యతిరేకంగా జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం, వారికి "ఆయురక్ష కిట్" లను అందజేయడం జరిగుతోంది. "ఆయురక్ష కిట్" లో తిప్పతీగ నుండి తయారుచేసిన సంషామణి, ఆయుష్ కథా కాషాయం, ముక్కులో వేసుకోవడానికి అనూ తైలం మొదలైనవి ఉంటాయి. ఇప్పటి వరకు 1,58,454 ఆయురక్ష కిట్లు రెండు దశల్లో పంపిణీ చేయబడ్డాయి, మొత్తం 90 శాతం కంటే ఎక్కువ మంది వీటిని సమ్మతితో వినియోగిస్తున్నారు. ఢిల్లీ పోలీసు సిబ్బంది అభిప్రాయాలను భారతీయ ప్రజారోగ్య సంస్థ (పి.హెచ్.ఎఫ్.ఐ) సహాయంతో విశ్లేషిస్తున్నారు. ఆందోళన స్థాయి తగ్గడం, సాధారణ శ్రేయస్సు అనుభూతి మరియు జలుబు, దగ్గు వంటి చిన్నచిన్న అనారోగ్య లక్షణాలు తగ్గినట్లు, సిబ్బంది నుండి సానుకూల స్పందనలు వస్తున్నాయి. ఢిల్లీలోని సాధారణ జనాభా పోకడలతో పోల్చితే, కోవిడ్-19 వ్యాధి సోకిన వారి సంఖ్య తగ్గినట్లు కూడా గమనించదమైంది.

ఏ.ఐ.ఐ.ఏ. సందర్శనలో భాగంగా, మంత్రి వైద్యుల బృందంతో కూడా సంభాషించారు. కేంద్రంలోని రోగుల శ్రేయస్సు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. కోవిడ్-19 ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి, ఆయుర్వేద ఔషధాల చికిత్స ఫలితాల గురించి, ఆయన, వారి అభిప్రాయాలను అడిగి, తెలుసుకున్నారు.

కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో ఏ.ఐ.ఐ.ఏ. అందిస్తున్న అందిస్తున్న సేవలకు కేంద్ర మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయుర్వేద సూత్రాల ఆధారంగా కోవిడ్ పాజిటివ్ రోగులకు సంరక్షణ అందించడంలో ఏ.ఐ.ఐ.ఏ. మొత్తం బృందం ప్రదర్శించిన స్ఫూర్తి, ఉత్సాహం, ధైర్యం, కృషి ప్రశంసనీయమని, ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కోవిడ్-19 రోగులకు వారి శరీర తత్వానికి తగిన విధంగా ఆయుర్వేద ఔషధంతో పాటు, ఆహారం, యోగా మరియు విశ్రాంతి పద్ధతుల ద్వారా సంపూర్ణ సంరక్షణను అందించడంలో ఏ.ఐ.ఐ.ఏ. ఒక ఆదర్శవంతమైన పాత్ర పోషిస్తోందని శ్రీపాద యశో నాయక్ అభినందించారు.

# అయోధ్యలో లడ్డూప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు

## తయారీలో బిజీగా ఉన్న ట్రస్ట్

లక్నో,జూలై31(ఆర్ఎన్ఎ): అయోధ్యలో రామ మందిరం నిర్మాణం కోసం మరో ఐదు రోజుల్లో భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం కోసం ఇప్పటికే ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ మేరకు మని రాందాస్ చావ్నీలో లడ్డూల తయారీ ప్రక్రియ కొనసాగుతున్నది. కార్యక్రమంలో పంచిపెట్టడం కోసం మొత్తం 1.11 లక్షల లడ్డూలు తయారు చేస్తున్నామని అక్కడ పనిచేస్తున్నవారు తెలిపారు.

రామాలయం నిర్మాణం కోసం అయోధ్యలో ఆగస్టు 5న భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానున్నారు. ప్రధాని చేతులమీదుగానే శంకుస్థాపన జరగనుంది. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ పోలీసులు అయోధ్యలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

# భారతదేశ వ్యవసాయ మరియు పారిశ్రామిక వృద్ధికి ఆర్‌సిఎఫ్ ఎంతో దోహదపడింది

హైదరాబాద్, జులై 31:కోవిడ్ -19 సవాళ్లు ఉన్నప్పటికీ, రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వరంగ సంస్థ రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్)తన కార్యకలాపాలను విజయవంతంగా కొనసాగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2020-21 లో 2020 జూలై 27 వరకు దాని పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకాలలో రూ.200 కోట్లు దాటింది. సంస్థ ప్రకటన ప్రకారం 67 రోజుల్లో రూ. 100 కోట్లను సాధిస్తే, తర్వాతి 51 రోజుల్లోనే రూ. 100 కోట్ల అమ్మకాలను సాధించినట్టు వెల్లడించింది. ఆర్‌సిఎఫ్ పరిశ్రమిక ఉత్పత్తుల విభాగం (ఐపిడి) తన వ్యాపార సముచ్ఛయంలో ఉన్న 23 ఉత్పత్తులు- ఇతర పరిశ్రమలైన ఫార్మస్యూటికల్స్, క్రిమిసంహారక మందులు, గనులు, బేకరీ, ఫైబర్లు, తోలు మొదలైన పరిశ్రమల్లో ప్రధాన అవసరాలుగా ఉన్నాయి. సవాళ్ళను ఎదుర్కొంటున్న ప్రస్తుత సమయంలో దేశ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు మరింత వృద్ధి సాధించడానికి బలమైన చోదక శక్తిగా ఆర్‌సిఎఫ్ నిలిచింది. ఆహార భద్రత కు ఈ సంస్థ ఇతోధిక సాయం చేసింది. రైతులకు నిరంతరంగా ఎరువులను అందించింది. సరఫరా గొలుసు వ్యవస్థలో ఈ మహమ్మారి సమయంలో అనేక అడ్డంకులు ఎదురైనప్పటికి ఆర్‌సిఎఫ్ 2020-21 మొదటి త్రైమాసికంలో 5.9 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను విజయవంతంగా ఉత్పత్తి చేస్తోంది.

# పదవి విరమణ పొందిన పోలీసులకు సన్మానం



కరీంనగర్, జులై 31 (నేటినిజం ప్రతినిధి):శుక్రవారం నాడు పదవి విరమణ చేసిన పోలీసు అధికారులను కరీంనగర్ అడిషనల్ పోలీస్ కమిషనర్(పరిపాలన) జి చంద్రమోహన్ శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా పోలీస్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సోసైటీద్వారా జమఅయిన మొత్తాన్ని చెక్కుల రూపంలో అందించారు.

పదవివిరమణ చేసిన వారిలో ఏఎస్ఐలు ఆర్ వీరస్వామి(కొత్తపల్లి), ఎస్ వెంకటేశ్వర్లు(టూటౌన్,కరీంనగర్), ఏఆర్ఎస్ఐ యండి అబ్దుల్ జబ్బార్(సిపిఆర్,కరీంనగర్), హెడ్‌కానిస్టేబుల్ పి సుధాకర్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా పోలిస్ అడిషనల్ కమిషనర్ జి చంద్రమోహన్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని నియంత్రణలో ఉంచుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పదవి విరమణ సందర్భంగా లభించే రూపాయలను శాశ్వత అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని, అత్యాశకుపోయి ఇతర వ్యవహారాల్లో పెట్టుబడిలు పెడితే తిరిగి లభించేఅవకాశాలు ఉండవనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షులు యం సురేందర్, సభ్యులు రామస్వామి, పందరి,మధు తదితరులు పాల్గొన్నారు.

# ఖాదీకి భారీ ప్రోత్సాహం; ఖాదీ, గ్రామీ పరిశ్రమల సంస్థ నుంచి లక్షా 80వేల మాస్కుల కొనుగోలుకు రెడ్ క్రాస్ సొసైటీ ఆర్డర్

హైదరాబాద్, జులై 31:భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ.ఆర్.సి.ఎస్) నుంచి ఖాదీ, గ్రామిణ పరిశ్రమల సంస్థ (కె.వి.ఐ.సి.)కి ప్రతిష్టాత్మకమైన కొనుగోలు ఆర్డర్ లభించింది. లక్షా 80వేల ముఖ కవచాల (ఫేస్ మాస్కుల) సరఫరా చేయాలంటూ రెడ్ క్రాస్ సొసైటీ కోరింది. ఖాదీ పేస్ మాస్కుల నాణ్యత, అందుబాటులో ధర వంటి కారణాలవల్ల ఈ ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ ప్రకారం వందశాతం డబుల్ ట్విస్టెడ్ చేనేత నూలు వస్త్రంతో రెండు పొరలుగా ఈ మాస్కులు తయారు చేయాల్సి ఉంటుంది. ఈ మాస్కులను గోధుమ వర్ణంతో పైపింగ్ ఏర్పాటుతో తయారు చేస్తారు. రెడ్ క్రాస్ సొసైటీ అందజేసిన నమూనా ప్రకారం ఈ మాస్కులను కె.వి.ఐ.సి. ప్రత్యేకంగా తయారు చేస్తుంది. ఈ మాస్కులకు ఎడమవైపున ఐ.ఆర్.సి.ఎస్. లోగోను, కుడివైపున ఖాదీ ఇండియా లోగోను ముద్రిస్తారు.. వచ్చే నెలలో మాస్కుల సరఫరా మొదలవుతుంది.

ఈ మాస్కుల తయారీ కోసం 20వేల మీటర్ల వస్త్రం కావాల్సి ఉంటుంది. ఖాదీ హస్తకళాకారులకు అదనంగా 9వేల పనిదినాలు అవసరమవుతాయి.

రెడ్ క్రాస్ సొసైటీనుంచి మాస్కుల కొనుగోలు ఆర్డర్ లభించడంపట్ల కె.వి.ఐ.సి. చైర్మన్ వినయ్ కుమార్ సక్సేనా హర్షం వ్యక్తం చేశారు. ఖాదీ పేస్ మాస్కులకు భారీ స్థాయిలో గిరాకీ లభించడం "ఆత్మనిర్భర భారత్" లక్ష్యాల సాధనలో ఒక ముందడుగు అని ఆయన వ్యాఖ్యానించారు. తమ ఖాదీ వృత్తి కళాకారులు మరింత ఎక్కువ నూలు, వస్త్రం ఉత్పత్తి చేయడానికి, ప్రస్తుత కష్టసమయంలో వారు మరింత ఆదాయం సమకూర్చుకోవడానికి ఇది దోహదపడుతుందని సక్సేనా చెప్పారు.

ఇప్పటివరకూ పది లక్షల ఫేస్ మాస్కులను కె.వి.ఐ.సి. విక్రయించింది. రెండు పొరల నూలు మాస్కులు, మూడు పొరల పట్టు మాస్కులు వీటిలో ఉన్నాయి. ఇప్పటివరకూ జమ్ము కాశ్మీర్ నుంచి అతి పెద్ద కొనుగోలు ఆర్డర్ లభించింది. 7లక్షల మాస్కుల తయారీకి జమ్ము కాశ్మీర్ ప్రభుత్వంనుంచి ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ ప్రకారం సకాలంలో మాస్కులను కూడా అందజేశారు.

ఇటీవలి కాలంవరకూ కోటి రుపాయలకు పైగా విలువైన లక్ష మీటర్ల నూలు వస్త్రాన్ని, దాదాపు 200మీటర్ల పట్టు వస్త్రాన్ని మాస్కుల తయారీకి వినియోగించారు. వివిధ రంగుల్లో ఈ మాస్కులు తయారు చేశారు.

మాస్కుల తయారీకి రాష్ట్రపతి భవన్, ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, వివిధ వర్గాల ప్రజలనుంచి ఈ-పోర్టల్ ద్వారా కె.వి.ఐ.సి.కి పదే పదే ఆర్డర్లు లభిస్తున్నాయి. భారతీయ రైల్వేలకు దాదాపు 20 వేల మాస్కులను కె.వి.ఐ.సి. సరఫరా చేసింది. మాస్కుల విక్రయంతో పాటుగా కె.వి.ఐ.సి. దాదాపు పది లక్షలమేర ఖాదీ మాస్కులను ఉచితంగా కూడా పంపిణీ చేసింది. దేశంలోని వివిధ జిల్లాల పరిపాలనా యంత్రాగాలకు, ఖాదీ సంస్థలకు ఈ మాస్కులను పంపిణీ చేశారు.

"కరోనా వైరస్ తో పోరాటంలో ఫేస్ మాస్కులు కీలకపాత్ర వహిస్తున్నాయి. డబుల్ ట్విస్టెడ్ ఖాదీ వస్త్రంతో ఈ మాస్కులను తయారు చేస్తారు. నాణ్యతను పాటించడంతోపాటుగా, డిమాండ్ కు అనుగుణంగా, ధరపరంగా అందుబాటులో ఉండేలా ఈ మాస్కులు తయారవుతున్నాయి. శ్వాస క్రియకు ఇబ్బంది కలగకుండా, ఉతుక్కొని మళ్లీ వినియోగించుకునేందుకు వీలుగా, వినియోగం అనంతరం ప్రకృతిలో కలిసిపోయేలా" ఈ మాస్కులు ఉంటాయని సక్సేనా చెప్పారు

# ఏపీ వైద్యశాఖలో 26,778 పోస్టుల నియామకానికి ప్రభుత్వం ఆమోదం

అమరావతి, జులై 31: : ఆంధ్రప్రదేశ్‌లో కరోనావైరస్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని 26,778 మంది వైద్య సిబ్బంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తిని నివారించడంలో సాయపడనుంది.

రాష్ట్ర ప్రభుత్వం నియమించనున్న ఈ 26,778 పోస్టుల్లో మెడికల్ ఆఫీసర్, స్పెషలిస్ట్ డాక్టర్, స్టాఫ్ నర్స్, టెక్నీషియన్ ఉద్యోగాలున్నాయని తెలిసింది. జూలై 31 నుంచి ఆగస్టు 5వరకు వీటిని భర్తీ చేయాలని కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ రిక్రూట్‌మెంట్ నేరుగా ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుంది.

అంతకుముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో సుమారు 10,000 మంది ఆరోగ్య సంరక్షణ కార్మికులను నియమించడానికి ఆమోదం తెలిపింది. వైద్యులు, నర్సులు, సాంకేతిక నిపుణులు, ఇతర పోస్టులను ఆరోగ్య విభాగంలో భర్తీ చేయనున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ప్రస్తుతం 9,712 మంది సిబ్బందిని నియమించే విధంగా మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ప్రతిపాదనను ఆమోదించారు.

ఇవే కాకుండా వైద్యానికి రూ .1000 కన్నా ఎక్కువ ఖర్చు అయితే దాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చబడింది. జూలై 16 నుంచి మరో ఆరు జిల్లాల్లో దీన్ని అమలు చేశారు.

# ఏపీలో మూడు రాజధానులకు గ్రీన్ సిగ్నల్

అమరావతి, జులై 31: ఏపీ రాజధాని వికేంద్రీకరణ, సీఆర్డీఏ రద్దు బిల్లులకు ఆ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ శుక్రవారం ఆమోద ముద్ర వేశారు. దీంతో మూడు రాజధానులకు అధికారికంగా అనుమతి లభించినట్లుయ్యింది. ఇక ఏపీకి శాసన రాజధానిగా అమరావతి, కార్యనిర్వహక రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూల్ ఉండనున్నాయి. సీఆర్డీఏ చట్టం-2014 రద్దు బిల్లుతోపాటు, ఏపీ రాజధాని వికేంద్రీకరణ బిల్లులకు జనవరి 20నే ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. బిల్లులపై చర్చించేందుకు శాసన మండలికి పంపగా అక్కడ ఎలాంటి చర్చ జరుగకుండానే వాయిదా పడడంతో మూడు వారాల క్రితం గవర్నర్ ఆమోదానికి పంపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.